# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 138, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) బుధవారం -30 - జూలై - 2025


హిమాచల్ ప్రదేశ్ ను ముంచెత్తిన వరదలు..

## మండి జిల్లాలో బీభత్సం..



- మంగళవారం తెల్లవారుజామున కుండపోత
- కొట్టుకుపోయిన వాహనాలు.. రోడ్లు ధ్వంసం
- లోతట్టు ప్రాంతాల్లోని నివాసాల్లోకి చేరిన వరద

## 'దైనిక్ జాగరణ్'కు వ్యాసం రాసిన సోనియాగాంధీ ప్రధాని మోదీపై విరుచుకుపడిన సోనియాగాంధీ



### గాజా సంక్షోభంపై మోదీ మౌనాన్ని తప్పుబట్టిన సోనియా రాజ్యాంగ విలువలకు ద్రోహం చేస్తున్నారని మండిపాటు

ఢిల్లీ: గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సంక్షోభంపై 'నీచమైన మౌనం' వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. గాజా ప్రజలకు మద్దతుగా భారతదేశం 'స్పష్టమైన, ధైర్యవంతమైన' వైఖరిని తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. సోమవారం దైనిక్ జాగరణ్‌లో ప్రచురితమైన ఆమె వ్యాసంలో ఈ మేరకు పేర్కొన్నారు. 'గాజా సంకట్ పర్ మూక్‌దర్శక్ మోదీ సర్కార్' (గాజా సంక్షోభంపై మౌనంగా ఉన్న మోదీ సర్కార్) అనే శీర్షికతో ప్రచురితమైన తన వ్యాసంలో

# ఆహ్వానం లేకుండా పాక్‌కు వెళ్లింది ఎవరు?

## సీజ్ ఫైర్ నిర్ణయం ఎవరిది?

పహల్గాం ఘటన.. పూర్తిగా భద్రతా వైఫల్యమే

అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలు చేస్తున్నారు

ప్రతీరోజూ 1,000 నుంచి 1,500 మంది పర్యటించే ఆ ప్రాంతంలో ఒక్క సైనికుడు కూడా కాపలాగా ఎందుకు లేడు?

వాళ్లు ప్రభుత్వాన్ని నమ్మి అక్కడికి వెళ్తే.. ఈ ప్రభుత్వం దేవుడ్ని మీద భారం వేసి వాళ్లను అలా వదిలేసిందా?

ఉగ్రదాడికి రక్షణమంత్రి, ఇంటెలిజెన్స్ చీఫ్ బాధ్యత వహించారా? రాజీనామా చేశారా?.




ఢిల్లీ: పహల్గాం ఘటన.. పూర్తిగా భద్రతా వైఫల్యమేనని పైగా అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో మండిపడింది. ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో భాగంగా.. ఇటు లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, అటు రాజ్యసభలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే కేంద్రంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో రెండో రోజు చర్చలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ పాల్గొని ప్రసంగించారు. పర్యాటక ప్రాంతంలో భద్రత లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ కేంద్రంపై ఆమె విమర్శలు గుప్పించారు. "ఈ అంశంపై రక్షణ శాఖ మంత్రి గంటసేపు మాట్లాడారు. అధికార కూటమి ఎంపీలు కూడా మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్, ఉగ్రవాదంపై పోరు, జాతీయ భద్రత, చరిత్ర.. ఇలా అంశాలన్నింటిపై మాట్లాడారు. కానీ, ఒక్క విషయాన్ని వదిలేశారు. అసలు ఆ దాడి ఎందుకు?.. ఎలా జరిగింది? అనేది.. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలో కుటుంబ సభ్యుల కళ్లెదుటే 26 మంది చంపారు. అసలు ఆ ఉగ్రదాడి ఎందుకు.. ఎలా జరిగిందో మాత్రం కేంద్రం చెప్పడం లేదు.

కశ్మీర్‌లో ఉగ్రవాదం ముగిసిన అంకమని, అక్కడ పర్యటించాలని ప్రభుత్వాలు కోరుతున్నాయి. కానీ.. జరిగింది మరొకటి. శుభం ద్వివేదీకి వివాహమై ఆరు నెలలే అయ్యింది. ఏప్రిల్ 22వ తేదీన అందరు పర్యాటకుల్లాగే ఆ జంట విహారంలో మునిగిపోయింది. సరిగ్గా అదే సమయంలో అడవుల్లో నుంచి వచ్చిన ఉగ్రవాదులు వాళ్లపై తెగబడ్డారు. భార్య కళ్ల ముందే శుభంను చంపేశారు. గంట వ్యవధిలో మరో 25 మందిని చంపేశారు. మిగతా.. 2లో



బీసీ బిల్లు సాధన కోసం

## మూడు రోజుల దీక్ష

- బీసీ బిల్లు సాధన కోసం ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటలు దీక్ష చేస్తానన్న కవిత
- ఈ బిల్లు దేశానికి ఎంత అవసరమో చాటి చెప్పేందుకు దీక్ష అంటూ ప్రకటన
- బీసీ బిల్లు సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దీక్ష



## కన్వర్ యాత్రికులతో వెళ్తున్న బస్సుకు ప్రమాదం.. 18 మంది మృతి!

ఝూర్ఖండ్‌లోని దేవఘర్ జిల్లాలో ప్రమాదం

గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న ట్రక్కును ఢీకొట్టిన బస్సు

## ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమావేశం.. డీకే శివకుమార్ దూరం!



అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 50 కోట్ల గ్రాంట్ ఇవ్వనున్నట్లు సీఎం వెల్లడి

నిధుల కేటాయింపుకు సంబంధించి విధానసౌధలో సమావేశం కానున్న ఎమ్మెల్యేలు

# ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామిగా ఉంటుందన్న మంత్రి టాన్సీ లెంగ్

## ధన్యవాదాలు తెలిపిన సీఎం చంద్రబాబు

- ఏపీ, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామిగా ఉంటుందన్న మంత్రి టాన్సీ లెంగ్
- 2019 తర్వాత ఏపీలో వచ్చిన ప్రభుత్వం నుంచి సహకారం ఆగిపోయిందన్న మంత్రి
- సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటన ఫలప్రదం కావాలని ఆకాంక్షించిన టాన్సీ లెంగ్
- ధన్యవాదాలు తెలుపుతూ.. సింగపూర్ భాగస్వామ్యం విలువైందన్న చంద్రబాబు




అమరావతి: సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగానే ఆ దేశ మానవవనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్సీ లెంగ్ కీలక ప్రకటన చేశారు. వివిధ రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేయడమే కాకుండా.. గత ప్రభుత్వ విధానాలను ప్రస్తావిస్తూ ఎక్స్ వేదికగా సింగపూర్ మంత్రి చేసిన ప్రకటన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏపీ, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యంగా ఉండేందుకు సిద్ధంగా ఉందని ఆ దేశ ట్రేడ్ ఇండస్ట్రీ శాఖలోని మానవ వనరులు, శాస్త్రసాంకేతిక మంత్రి టాన్సీ లెంగ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుతో జరిగిన సమావేశంపై 'ఎక్స్' (ట్విట్టర్) హ్యాండిల్ లో పోస్టు చేసిన ఆయన ఏపీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం లాంటి రంగాలు పెట్టుబడులకు అనుకూలమని టాన్సీ లెంగ్ పేర్కొన్నారు. భారత్ లో అత్యంత వేగంగా ఎదుగుతున్న రాష్ట్రాల్లో ఒకటైన ఏపీలో ఫుడ్ ఎంపైర్, ఎవర్ వోల్ట్ లాంటి సింగపూర్ కంపెనీలు ఇప్పటికే పెట్టుబడులు, కార్యకలాపాల విస్తరణకు ఎదురుచూస్తున్నాయని తెలిపారు. మిగతా.. 2లో





## నాగార్జున సాగర్ కు భారీగా వరద ప్రవాహం

..నిండు కుండలా జలాశయం

- శ్రీశైలం నుంచి సాగర్ ప్రాజెక్టుకు 2,01,743 క్యూసెక్కుల వరద నీరు
- ప్రస్తుత సాగర్ కు ఔట్ ఫ్లో 41,882 క్యూసెక్కులు
- ప్రస్తుత సాగర్ నీటి మట్టం 586.60 అడుగులు

## ఒక్కో బిడ్డకు యేటా రూ. 43వేలు

### జనాభా పెంచేందుకు చైనా కొత్త పథకం..

కొన్నేళ్లుగా బాగా తగ్గిపోతున్న చైనా జనాభా



- జనాభాను పెంచడానికి డ్రాగన్ కంట్రీ కొత్త పథకానికి శ్రీకారం
- పిల్లల సంరక్షణ కోసం తల్లిదండ్రుల ఖాతాలలోకి ఒక్కో బిడ్డుకు యేటా రూ. 43వేలు



## శ్రీవారికి కానుకగా 2.5 కిలోల బంగారు శంకు చక్రాలు

- చెన్నైకి చెందిన సుదర్శన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ స్వామివారికి ఖరీదైన కానుక
- సుమారు రూ. 2.4 కోట్ల విలువైన బంగారు శంకు చక్రాలు సమర్పణ
- రంగనాయకుల మండపలో అదనపు ఈఓకు అందజేసిన కంపెనీ ప్రతినిధులు

## ఉగ్రవాదుల మతం చూసి బాధపడొద్దు..

### అఖిలేశ్ యాదవ్ కు అమిత్ షా కౌంటర్



ఆపరేషన్ సిందూర్ పై చర్చ సందర్భంగా లోక్ సభలో హోంమంత్రి ప్రసంగం

తనకు అడ్డుపడుతున్న ప్రతిపక్ష సభ్యులకు కౌంటర్ ఇచ్చిన షా

పాకిస్థాన్ తో మీరు చర్చలు జరుపుతారా అంటూ ప్రశ్న

ఆపరేషన్ మహదేవ్ వివరాలను పార్లమెంట్ లో వెల్లడించిన హోంమంత్రి

## ఆ 22 మంది చిన్నారుల బాధ్యత స్వీకరించిన రాహుల్ గాంధీ

ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు



తల్లిదండ్రులు, కుటుంబాలను కోల్పోయిన చిన్నారులు

ఇటీవల సరిహద్దు గ్రామాల్లో పర్యటించిన రాహుల్ గాంధీ

## డి.వడ్డీపల్లిలో చింతమాను వెంకటపతి ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



వెంకటగిరి, నియోజకవర్గం ఇన్చార్జ్ – విసీ సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): తిరుపతి జిల్లా డక్కిలి మండలం డి.వడ్డీపల్లి పంచాయితీ నందు మంగళవారం రోజు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చింతమాను వెంకటపతి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ ప్రచారం చేశారు. సుసంపన్నమైన, పారదర్శకమైన పాలన కోసం ప్రతి అడుగూ ప్రజలతో కలిసి.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐటి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు సుపరిపాలనకు తొలి అడుగు ప్రతి గడపకి మీ ప్రభుత్వము కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెంకటగిరి నియోజవర్గం శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు డక్కిలి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వర్ రెడ్డి సూచన మేరకు డక్కిలి మండలం మాజీ జెడ్పిటిసి ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు సలహాలుతో ఈ కార్యక్రమం నిర్వహించారు చింతమాను వెంకటపతి మాట్లాడుతూ రైతులకు, అన్నదాత సుఖీభవ మరియు ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలో ప్రారంభం కానున్నాయి అని వివరించారు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ తల్లికి వందనం సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు వంటి ఎవరికైనా పథకాలు అందకపోతే స్థానిక నాయకులుకు తెలియజేయాలని కోరారు ప్రభుత్వం అందజేస్తున్నాం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన భోజనం అందించిన ఘనత కూటమి ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి సంబంధిత అధికారులతో మాట్లాడి అందరికీ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇస్తున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో చింతమాను వెంకటపతి . డి వడ్డీపల్లి సర్పంచ్ వేపమాను చెంచమ్మ వేపమను.యువరాజ్ , పార్టీ ప్రధాన కార్యదర్శి వేపమను రాములు ,అధ్యక్షులు చింతమను భాస్కర్ ఉపాధ్యక్షులు తిరుపతి సుధాకర్ , బీజేపీ నాయకులు బోసి నరసింహులు ,185 పోలింగ్ బూత్ ఇంచార్జి పాపయ్య గారి గోవింద్ ,186 పోలింగ్ బూత్ ఇంచార్జి బసవయ్య గారి అరుణ్ కుమార్ మరియు పార్టీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు

## కనీస సౌకర్యాలు కల్పించాలి

### వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీ యాదవ్



గుంతకల్లు ప్రతినిధి – పల్లె రామాంజనేయులు జూలై 30 (శుభోదయం న్యూస్) : ప్రభుత్వ వసతి గృహాల్లో దుప్పట్లు ట్రంకు పెట్టెలు లేక విద్యార్థిని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశి యాదవ్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు మంగళవారం ఆయన పట్టణంలోని కేజీబీ వి వసతి గృహాన్ని తనిఖీ చేశారు ఈ సందర్భంగా వంశి యాదవ్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ఇవ్వాల్సిన దోమతెరలు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్న విద్య కోసం తాము వేలాది కోట్లు ఖర్చు పెడుతున్నామని చెప్పుకొస్తున్న కూటమి ప్రభుత్వం ఈ ఒక్క విద్యార్థి కూడా మంచి చేసిన పాపను పోలేదన్నారు సంక్షేమ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు మణికంఠ ఉపాధ్యక్షుడు అశోక్ విద్యార్థి నాయకులు శీన లడ్డు పవన్ శివ తదితరులు పాల్గొన్నారు.

### యాలూరు గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని

## ప్రారంభించిన మండల వ్యవసాయ అధికారి



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): ఖరీఫ్ సీజన్లో పంటను సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి అన్నారు. ఈ మేరకు ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు పంట నష్టపరిహారం, పంట బీమా ,పంట కొనుగోలు అందుతాయని,రైతులందరూ తప్పక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, నాగార్జున,అగ్రికల్చర్ అసిస్టెంట్ అహ్మద్ ,హరి, రైతులు పాల్గొన్నారు. అలాగే కౌలు కార్డులు వీఆర్వో ద్వారా తీసుకోవాల్సిందిగా,అలాగే అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు ఎన్.పి. సి.ఐ బ్యాంకులింకేజ్ లేనటువంటి రైతులు వివరాలు ప్రతి ఒక్క ఆర్.ఎస్.కె లలో ఉంచడం జరిగినది ప్రతి ఒక్కరూ ఎన్.పి. సి.ఐ బ్యాంకు లింకేజ్ చెక్ చేసుకుని వారి యొక్క బ్యాంకు ద్వారా లింకేజీ చేసుకోవాలని కోరారు. అప్పుడే అమౌంటు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

### ఐవిఎఫ్ ఏ.ఆర్.టి క్లీనిక్ లను ఆకస్మికముగా

## తనిఖీ నిర్వహించిన డిఎంహెచ్ఓ...





నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి వెంకటరమణ నంద్యాల పట్టణములో ఉన్నటువంటి మాతృత్వ ఏ.ఆర్.టి క్లినిక్,ఐకాన్ ఐవిఎఫ్ ఏ.ఆర్.టి క్లినిక్, నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు గల ఏ.ఆర్.టి క్లీనిక్ లను మరియు స్వర్ణ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ లను ఆకస్మికముగా తనిఖీ నిర్వహించారు.ఏ.ఆర్.టి క్లినిక్ నందు ప్రభుత్వ ఉత్తర్వ్యాలకు అనుగుణంగా అర్హత కలిగినటువంటి స్టాఫ్, క్లినిక్ లో ఉన్నటువంటి పరికరాలు స్పెషాలిటీ డాక్టర్ ల ను.ధరల పట్టికను మరియు సంభందించిన రికార్డులను తనిఖీ చేశారు. ఏ.ఆర్.టి క్లినిక్ మరియు ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలు, స్కానింగ్ కేంద్రాలు మరియు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ధరల పట్టికను ప్రజలకు అర్థమయ్యే విధముగా రిసెప్షన్ కౌంటర్ నందు ఇంగ్లీషు మరియు తెలుగు భాషల లో ప్రదర్శించవలేనని సంభదిత ప్రైవేట్ రిజిస్టర్ ఫెసిలిటీ యాజమాన్యాలను ఆదేశాలు జారీచేశారు. దరల పట్టికను ప్రదర్శించని సంభందిత ప్రైవేట్ రిజిస్టర్ ఫెసిలిటీ లకు చట్టరీత్యా చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు.ప్రభుత్వము నిర్దేశించినటువంటి ఫీజులకు అనుగుణంగా రోగుల వద్ద నుండి ఫీజులు వసూలు చేయవలెనని లేనిచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. మరియు రిజిస్టర్ కానటువంటి ప్రైవేట్ క్లినిక్ లు, ప్రైవేట్ ఆసుపత్రులు. డయాగ్నస్టిక్ కేంద్రాలు మరియు స్కానింగ్ కేంద్రాలు వెంటనే ప్రభుత్వము నిర్దేశించినటువంటి ఫీజులను ఆన్లైన్ ద్వారా డిస్ట్రిక్ట్ రీజిస్టింగ్ అథారిటీ పేరు మీద చెల్లించి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి వద్ద నమోదు చేసుకోవలేనని, రిజిస్టర్ చేసుకోకుండా నడిపితే క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారము చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేసారు.

## ముమ్మరంగా సాగుతున్న ఆడమిల్లి వంతెన డైవర్షన్ పనులు

### అడమిల్లి శాశ్వత వంతేన నిర్మాణానికి 132.18 కోట్లు మంజూరు



ఏలూరు జిల్లా ప్రతినిధి- ప్రసాద్ (శుభోదయం న్యూస్) : ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం ఆడమిల్లి రహదారి తాత్కాలిక దారి మల్లింపుకు రు. 18 లక్షలు మంజూరు, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఏలూరు- జంగారెడ్డిగూడెం మధ్య అడమిల్లి వద్ద కూలిపోయిన వంతెన నిర్మాణానికి చింతలపూడి ఎమ్మెల్యే శ్రీ సొంగా రోషన్ కుమార్ యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వం నుండి వంతెన నిర్మాణానికి 132 కోట్లు మరియు తాత్కాలిక దారి మల్లింపు వంతెనకు 18 లక్షలు మంజూరు చేయించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వంతెన నిర్మాణానికి మీద బ్రిడ్జ్ డైవర్షన్ పనులు చేపట్టడానికి అడ్డుగా ఉన్న 11 కెవి ట్రాన్స్ఫార్మర్, లైన్ లు బదలాయింపు జరిగింది, అడ్డు గా ఉన్న 33 కెవి లైన్ జరపాలంటే ముందుగా ఎలక్ట్రికల్ మరియు డిపార్ట్మెంట్ వారికీ శుక్రవారం వరకు సమయం పడుతుంది, ట్రాన్స్ఫార్మర్ శుక్రవారం వేరే చోటుకు కదిలించి వచ్చే బుధవారం నాటికి ఆడమిల్లి బ్రిడ్జి డైవర్షన్ పనులు పూర్తి చేస్తామని ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చేస్తామని చింతలపూడిశాసనసభ్యులు తెలియపరిచారు.

## అక్టోబర్ నాటికి వంద పడకల హాస్పిటల్ పూర్తి చేస్తాం

### చింతలపూడి నియోజకవర్గం ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్



ఏలూరు జిల్లా ప్రతినిధి – ప్రసాద్ (శుభోదయం న్యూస్): చింతలపూడి హాస్పిటల్ రోల్ మోడల్ గా తిర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నాను. హాస్పిటల్ కి వచ్చే ప్రతి పేషెంట్తో మర్యాద పూర్వకంగా వ్యవహరించి వారి కోసం ఎక్కువ సమయం కేటాయించాలి. అప్పుడే పేషెంట్లు తమ సమస్యలను డాక్టర్లకు మనస్ఫూర్తిగా చెప్పుకుంటారు. పాముకాటు పాయిజన్ కేసులు వెంటనే రికవరీ చేసే విధంగా వైద్యులు కృషి చేయాలి. అందరం కలిసికట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయి. నూతనంగా వచ్చిన మత్తువైద్యానిపుణులు, చిన్న పిల్లలు వైద్య నిపుణులు ఆహ్వానం, మంచి సేవలు అందించాలి. కూటమి ప్రభుత్వం రాకముందు హాస్పిటల్ లో ఎన్నో సమస్యలు ఉన్నాయి, కూటమి ప్రభుత్వం వచ్చాక హాస్పిటల్ అభివృద్ధి కమిటీ వేసేక మంచి ఫలితాలు వచ్చాయి. సమస్యలు ఒకొక్కటిగా పరిష్కారం అవుతున్నాయి, ఇంకా ఉన్న సమస్యలపై ద్రుష్టి పెట్టేము. వైద్యులు కొరత ఉంది జిల్లా అధికారులతో మాట్లాడటం జరిగింది. మనకి వైద్యులు వస్తారు వచ్చే విధంగా జిల్లా అధికారులతో రోజు మాట్లాడటం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్,వైద్యులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం



ఏలూరు జిల్లా ప్రతినిధి-ప్రసాద్ (శుభోదయం న్యూస్) : చింతలపూడి మండలం రేచర్ల మల్లయ్య గూడెం గ్రామ సచివాలయం నందు కౌలు రైతు లందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలనిఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు రేచర్ల మల్లయ్య గూడెం గ్రామ సచివాలయాల నందు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని అలాగే సబ్సిడీతో కూడిన విత్తనాలు ఎరువులు అందించాలని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఐదు లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కౌలు రైతులకు ఇవ్వాలని గ్రామసభలు నిర్వహించి భూమిలేని కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన్ని సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు వినతి పత్రం పత్రం ఇచ్చిన మల్లాయగూడెంలో తక్కిలపాటి ప్రసాద్ రావు రేచర్లలో కంచర్ల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదవారిపై టిడిపి నాయకుల బంధువుల దౌర్జన్యం....



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలంలోని వడ్డే అగ్రహారం లో పేదల ఇళ్ల బేస్మెంట్ ను కూల్చివేసిన టీడీపీ నేత బంధువులు. కడప జిల్లా గోపవరం మండలంలోని వడ్డే అగ్రహారం గ్రామంలో ఉండే గండికోట సుబ్బయ్య అనే వ్యక్తి గత 30 సంవత్సరాలు గా తన ఆధీనంలో ఉండే దొడ్డిని పశువుల పాక కు మరియు బాత్రూమ్ కొరకు బేస్మెంట్ నిర్మించుకుంటే దానిని టీడీపీకి చెందిన మాజీ జేపీటీసీ రావణయ్య తనకు తెలియకుండా ఎవరు ఏ ఇంటి నిర్మాణం చేయకూడదని ఏం జరిగినా నాకు తెలిసి చేయాలని తన మనసులతో కావాలనే బేస్మెంట్ను పగలకొట్టడం జరిగింది.కేవలం అధికార బలంతో నాలాంటి నిరుపేద వాడ్ని ఇబ్బంది పెట్టడం ఎంత వరకు సమంజసం.మాకు మా ఆడువారి నిత్య అవసరాల కోసం బాత్రూమ్ నిర్మించుకుంటుంటే పగల కొట్టడం ఎంత వరకు న్యాయం అని వాపోయారు.దీని పైన అధికారులు మా ప్రియతమ నేత ఇప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని అదేవిధంగా మంత్రి నారా లోకేష్ గారిని బద్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ రితీష్ రెడ్డి గారిని ఇక్కడి విషయాన్ని పరిశీలించి తగువారిపై చర్యలు తీసుకోవాలని తనకు న్యాయం చేయాలని అక్కడ టిడిపి పేదవారు కోరుకుంటున్నారు.

## బద్వేల్ మున్సిపాలిటీ వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షుడిగా టి.సునీల్..



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి( శుభోదయం న్యూస్ ): కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు బద్వేలు మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడిగా టి .సునీల్ గారిని నియమితులైన సందర్భంగా ఈరోజు పోరుమామిళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు నియర్ కవర్గ ఇన్చార్జ్ మరియు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు అనంతరం సునీల్ గారు మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతను అంకిత భావంతో నిర్వహిస్తానని పార్టీ అభివృద్ధికి పాటుపడతానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి, మండల వాలంటరీ వింగ్ అధ్యక్షులు శివ,శ్రీనివాసులు, సుజన్త్, సాంబశివ, తదితరులు పాల్గొన్నారు



## రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గన్నేపాటి మల్లేష్ గబద్వేల్ లీడ్ క్యాప్ సంస్థకి స్థలం కేటాయిస్తామని హామీ



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): మంగళవారం నాడు బద్వేల్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ గొడుగునూరు రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లేష్ మాట్లాడుతూ బద్వేల్ మండలం చెన్నంపల్లి పొలం సర్వేనెంబర్ 15 80 బార్బీ లో మూడు ఎకరాల 64 సెంట్లు లిడ్ కాప్ సొసైటీ కి కేటాయించను జరిగిందని ఆ స్థలంలో మాదిగ విద్యార్థులకు లిట్ క్యాబ్ సంబంధమైన చెప్పులు తయారీ బ్యాగులు చర్మాలు శుద్ధి చేయడం ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయుటకు ఉపయోగపడే ఈ స్థలాన్ని కొందరు వ్యక్తులు చేసి కట్టడాలు కట్టడం జరిగింది కాదని కట్టడాలు కట్టిన ఎవరినైనా ఉపేక్షించే పద్ధతి లేదని త్వరలోనే మూడు ఎకరాలు 64 సెంట్లు భూమిని కొలతలు వేయించి త్వరలో లెదర్ ఇండస్ట్రీ ఏర్పాటు చేయుటకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ గొడుగునూరు రాజశేఖర్ దళిత నాయకులు ముండ్లపాడు పిచ్చయ్య కేశవయ్య దళిత వేదిక జిల్లా అధ్యక్షులు ఓబయ్య బాలయ్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వనరుల కేంద్రం వారు పంటలలో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం



దోర్నాల, మండల రిపోర్టర్ – ఆవులయ్య (శుభోదయం న్యూస్ ) : ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఈ రోజు అనగా తేది :29.07.2025 న దోర్నాల మండలంలోని నల్లగుంట్ల గ్రామం లో జిల్లా వనరుల కేంద్రం, ఒంగోలు వారు వివిధ పంటలలో యాజమాన్య పద్ధతుల పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో డి ఆర్ సి ఏడియే శ్రీ రామ్మోహన్ రావు ముఖ్య అతిధిగా పాల్గొని రైతులకు ప్రత్తి పంటలో సస్య రక్షణ చెర్యలు గురించి, అలాగే ఎరువుల వాడకం తగ్గించి పంటలు పండించే విధానం అనగా ప్రకృతిలో లభ్య మయ్యే కాషాయలు, వేప పిండి, వేప గింజల కాషాయం తయారు చేయు విధానం గురించి రైతులకు తెలియజేసారు. అలాగే ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు (రె ) వై పాలెం వారు శ్రీ ఇ. వెంకట రమణ పాల్గొని రైతులకు కంది పంట లో విత్తనాశుద్ధి, సస్య రక్షణ చెర్యలు గురించి, ఏండ్డు తెగులు నివారణ చెర్యలు గురించి తెలియజేసారు. అలాగే ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ పాల్గొని రైతులకు మొక్క జొన్న పంట పై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ఈ కార్యక్రమంలో రైతులకు మెటీరియల్ పంపిణి చేయడం జరిగింది.



## పొలం పిలుస్తుంది కార్యక్రమం



దోర్నాల, మండల రిపోర్టర్ – ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా దోర్నాల మండలంఈ రోజు అనగా తేది :29.07.2025 న దోర్నాల మండలంలోని అయినముక్కల మరియు దోర్నాల గ్రామ లలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ పాల్గొని గ్రామంలో సాగు చేసిన ప్రత్తి పంటను సందర్శించి యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైతన్య కుమార్, ఏపీసీఎన్ ఎఫ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



### ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓసి లను

## పంపిణీ చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) : గన్నవరం నియోజకవర్గంలోని ఇరువురు రోగులకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఎల్ఓసి లను ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అందజేశారు. బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామ మాజీ సర్పంచ్ వణుకురు జోజి అనారోగ్యానికి గురికాగా విజయవాడలోని మణిపాల్ వైద్యశాలలో



చికిత్స పొందుతున్నాడు. గన్నవరం మండలం అచ్చంపూడి గ్రామానికి చెందిన దుడ్ల నాగేశ్వరరావు విజయవాడలోని అను వైద్యశాలలో చికిత్స పొందుతుండగా వీరిద్దరికీ మెరుగైన వైద్య చికిత్స అందించేందుకుగాను రోగుల కుటుంబ సభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ ను సంప్రదించగా సత్వరమే స్పందించిన యార్లగడ్డ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెరొక రూ.2.50 లక్షలు సాయం మంజూరు చేయించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రోగుల కుటుంబ సభ్యులకు ఎల్ఓసి లను ఎమ్మెల్యే వెంకట్రావు అందజేశారు.

### రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటథ్లాన్ ఛాంపియన్షిప్

## పోటీలలో కృష్ణాజిల్లా ఓవరాల్ చాంప్



విజయవాడ, (శుభోదయం న్యూస్): ఈనెల 26 నుంచి 27 వరకు విజయవాడ పెనమలూరు బ్లూమింగ్ డెల్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటథ్లాన్ పోటీలలో కృష్ణాజిల్లా క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించినట్లు కృష్ణాజిల్లా మోడ్రన్ పెంటథ్లాన్ సంగం ప్రధాన కార్యదర్శి మరీదు నరేంద్ర బాబు మంగళవారం నాడు పత్రికలకు తెలిపారు. 26వ తేదీన టెట్రాథ్లాన్ (ఫెన్సింగ్, స్విమ్మింగ్,రన్నింగ్, షూటింగ్ ) 27వ తేదీన ట్రైయాథిల్ (స్విమ్మింగ్, రన్నింగ్, షూటింగ్) క్రీడాంశాలలో పోటీలను నిర్వహించగా అన్ని ఈవెంట్లలో కృష్ణాజిల్లా ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించినట్లు ఆయన తెలిపారు.మొత్తం 27 పథకాలు సాధించగా సీనియర్ మెన్ విభాగంలో ఒక గోల్డ్, సీనియర్ ఉమెన్ విభాగంలో ఒక బ్రాంచ్ సబ్ జూనియర్ బాయ్స్ విభాగంలో రెండు గోల్డ్, ఒక బ్రాంచ్ సబ్ జూనియర్ గర్ల్స్ విభాగంలో మూడు గోల్డ్,ఒక సిల్వర్ సబ్ జూనియర్ రిలే విభాగం రెండు గోల్డ్ రిలే బాయ్స్ విభాగంలో రెండు సిల్వర్, నాలుగు బ్రాంచ్ రిలే గర్ల్స్ విభాగంలో రెండు గోల్డ్, రెండు సిల్వర్ మిక్స్ రిలే విభాగంలో రెండు గోల్డ్, రెండు సిల్వర్, రెండు బ్రాంచ్ పథకాలు సాధించినట్లు నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ సాధించిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.పి రావు, సంయుక్త కార్యదర్శి ధనియాల నాగరాజు,రాష్ట్ర మోడ్రన్ పెంటథ్లాన్ అధ్యక్షులు వెలగపూడి ఉజ్వల్,ఆంధ్ర ప్రదేశ్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఆర్ సీజర్ రెడ్డి,జిల్లా కార్యదర్శి జి విజయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కే కృష్ణమోహన్, కోశాధికారి పి సాయికుమార్ అభినందనలు తెలిపారు.

## బోయళ్ళ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జయసింహ జన్మదిన వేడుకలు పాల్గొన్న పువ్వాడి వెంకటేశ్వర్లు



పామూరు, మండల రిపోర్టర్ బండి - రమేష్ (శుభోదయం న్యూస్): శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గారి తనయుడు ముక్కు జయసింహారెడ్డి గారి జన్మదినోత్సవ వేడుకల్ని మాజీ సింగిల్



విండో చైర్మన్ బోయళ్ళ నారాయణరెడ్డి మరియు మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నేషనల్ హైవే 565 ఆన్ టీ వద్ద కేక్ కటింగ్ ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు బైరెడ్డి జయరాంరెడ్డి, సింగల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, పట్టణ యువత అధ్యక్షులు మెంటా నరసింహారావు, వార్డ్ మెంబర్ పిడుగు శ్రీనివాసులు, వరికుటి చిరంజీవి, మోబీనా మౌలాలి, ఇన్నిమెర్ల గ్రామ కమిటీ అధ్యక్షులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, ఆర్ ఆర్ రఫీ, తోట రవికుమార్, వరికుటి హనుమంతరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న బోయళ్ల నారాయణరెడ్డి, వరికుటి చిరంజీవి



పామూరు, మండల రిపోర్టర్ బండి - రమేష్ (శుభోదయం న్యూస్): చంద్రశేఖర పురం పట్టణముకు చెందిన గుర్రం లక్ష్మి నారాయణ గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సింగల్ విండో చైర్మన్ బోయల నారాయణరెడ్డి మరియు వరికూటి చిరంజీవి వారి దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వరికుటి హనుమంతరావు, తోట రవికుమార్, శ్రీరామ్ శ్రీనివాసులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఒక దొంగ అరెస్ట్, ఏడు లక్షలు విలువ చేసే 71 గ్రాముల మూడు బంగారు చైన్లు స్వాధీనం



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూలై 30 (శుభోదయం న్యూస్) : బంగారు గొలుసులను దొంగతనం చేసే దొంగను వన్ టౌన్ సిఐ మనోహర్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు వివరాలు మేరకు దొంగతనం చేయడానికి ఉపయోగించిన హోండా షైన్ మోటర్ సైకిల్ రికవరీ. గుంతకల్లు ఆలూరు రోడ్డు సాయిబాబా గుడి ఎదురుగా కాపురం ఉంటున్న రాయల పుష్పావతి బంగారు చైనును అదేవిధంగా విజయనగర్ కాలనీ ఎల్ఐసి ఆఫీస్ దగ్గర బోయ మల్లీశ్వరి కి చెందిన బంగారు చైను ను గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లి గ్రామం వద్ద ఒక మహిళ మెడలో నుండి బంగారు చైను ను గుర్తు తెలియని వ్యక్తి మోటర్ సైకిల్ పై వచ్చి బలవంతంగా లాక్కొని వెళ్లడం జరిగినది. సదరు కేసుల కోసం గుంతకల్లు డీఎస్పి శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా మంగళవారం ఉదయం గుంతకల్లుకొనకొండ్ల రోడ్డు, లోనిభీమా పార్క్ దగ్గర సదరు కేసుల్లో దొంగతనం చేసిన కంబదూరు మండలం, వెంకటాంపల్లి గ్రామానికి చెందిన ఎనుముల మారుతి ప్రసాద్ ఉన్నాడని గుంతకల్ పోలీస్ స్టేషన్ సిఐ బి. మనోహర్, సిసిఎస్ఇన్స్పెక్టర్లు శేషగిరి, జైపాల్ రెడ్డి ఎస్ఐ వలీభాష లకు రాబడిన ఖచ్చితమైన సమాచారం మేరకు యస్సై కొండయ్య వారి సిబ్బంది కలసి అక్కడికి వెళ్ళగా సదరు ఎనుముల మారుతి ప్రసాద్ ను అరెస్టు చేసి అతని వద్దనున్న 07,50,000/- రూపాయల విలువచేసే 71 గ్రాముల బరువు గల 3 బంగారు చైన్లు మరియు దొంగతనానికి ఉపయోగించిన ఒక మోటార్ సైకిల్ ను స్వాధీన పరచుకోవడమైనది. ఎనుముల మారుతి ప్రసాద్ ను అరెస్టు చేసి ఇంచార్జ్ గుంతకల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచడమైనది. గుంటకల్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు, అసాంఘీక కార్యకలాపాలు మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్ లాంటి ఎలాంటి సమాచారం తెలియజేసిన సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాము. అసాంఘిక కార్యకలాపాలు జరిపే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.

## ఘనంగా ముక్కు జయ సింహ రెడ్డి జన్మదిన వేడుకలు

### పాల్గొన్న పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, బొల్ల నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు



పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గారి తనయుడు ముక్కు జయసింహారెడ్డి గారి జన్మదినోత్సవ వేడుకల్ని స్థానిక మండల టిడిపి కార్యాలయంలో!"కేక్ కటింగ్" చేసి ఘనంగా



నిర్వహించారు. ఈకార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు ఇర్రి కోటిరెడ్డి, అమీర్జాన్, మెంట నరసింహారావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, షేక్ కాజా రహమతుల్లా, పాలపర్తి రమణయ్య, పందిటి హరీష్, నొస్సం నాగేంద్ర చారి, షేక్ హాజీ గౌస్, కావేరి రసూల్, తోట రవికుమార్, వార్డ్ మెంబర్ పిడుగు శ్రీనివాసులు, మొబీనా మౌలాలి, నర్సింగ్ సాంబయ్య, మన్నం రమణయ్య, ఆర్ఆర్ రఫీ, శేషం మోషే, లక్ష్మీనారాయణ, గంధం హరిబాబు, షేక్ చిన్న హజరత్, మాలపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి దిశ నిర్దేశం చేయగల సత్తా తెలుగుదేశంపార్టీకి మాత్రమే ఉంది

(శుభోదయం న్యూస్), బిట్రగుంట: రాష్ట్రంలో16వేల కోట్లరూపాయలుఆర్థికలోటు ఉన్నప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమపథకాలనుముందుకు తీసుకునివెళుతున్నదనిరాష్ట్ర గనులు, భూగర్భమరియు ఎక్సైజ్ శాఖమాత్యులుకొల్లురవీంద్ర పేర్కొన్నారు. మంగళవారంకావలి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పలుఅభివృద్ధి కార్యక్రమాలకుశంకుస్థాపన చేశారు. తొలుతపట్టపుపాలెంవద్ద 22.60 రూపాయలవ్యయంతో అంతర్గతసిసిరోడ్లకు శంకుస్థాపన, తుమ్మలపెంట పల్లిపాలెంవద్ద44 లక్షల రూపాయలవ్యయంతో జల జీవన్ మిషన్ కింద్రతాగునీటి వసతికి మరియు27.4లక్షలమరో సిసిరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన అదేవిధంగా ఒట్టూరువద్ద25లక్షలు వ్యయంతోసిసిరోడ్లు నిర్మాణం55 లక్షలువ్యయంతో రక్షితమంచినీటి పథకంశంకుస్థాపనలు శాసనమండలిసభ్యులుబీద రవిచంద్ర మరియుస్థానిక శాసనసభ్యులుదగుమాటివెంకట కృష్ణారెడ్డిలతోకలిసిచేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ






ఎన్నికలకుముందు ఇచ్చినపలుహామీలలో 95శాతం పూర్తిచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడగానేపింఛన్లను పెంచిఅరియర్స్ తోపాటుకలిపి ఒకేసారిపింఛనుదారులకు చెల్లించడం జరిగిందన్నారు. నేడు రాష్ట్రంలో64లక్షలమంది పింఛన్దారులుఉన్నారన్నారు. నెలకు4000రూపాయలు పింఛను ఇచ్చే ఏకైకరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. తల్లికివందనంకింద కుటుంబంలోనిచదువుతున్న పిల్లలందరికీ ఇంటర్మీడియట్ వరకు 13వేల రూపాయలువంతున చెల్లించడంజరుగుతుందన్నారు. రాష్ట్రంలోనిఆడబిడ్డలకు సంవత్సరానికి మూడుగ్యాస్ సిలిండర్లుఉచితంగాఇచ్చేవిధంగా చర్యలుతీసుకోవడం జరిగిందన్నారు. రైతులను ఆదుకునేవిధంగా అన్నదాత సుఖీభవకార్యక్రమంకింద సంవత్సరానికి20,000వంతున మూడు విడతలుగా చెల్లించడం జరుగుతున్నదన్నారు. ఇచ్చిన హామీలలోభాగంగాఆగస్టు15 నుంచిమహిళలకు ఉచితబస్సు ప్రయాణంకల్పించే విధంగాచర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మత్స్యకారులనుఆదుకునే విధంగా వేటనిషేధంసమయంలో సంవత్సరానికి20వేల రూపాయలుఇవ్వడంజరిగిందని వివరించారు. శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర మాట్లాడుతూ మత్స్యకారులసమస్యలుతెలిసిన వ్యక్తి మంత్రి కొల్లురవీంద్రఅని కొనియాడారు. తమప్రభుత్వ హయాంలోఒట్టూరులోమోడల్ స్కూల్ ఏర్పాటుచేయడంతో పాటు అత్యధికనిధులతో సిసిరోడ్లు కూడాఏర్పాటుచేయడం జరిగిందన్నారు. అవసరమైనమేర అంగన్వాడి కేంద్రాలుతీసుకు రావడంజరిగిందన్నారు. గ్రామీణ సమస్యలుతెలుసుకునేందుకే ఈరోజుమంత్రితో పాటుఇక్కడికి (తుమ్మలపెంట)రావడం జరిగిందనిఆయనతెలిపారు. ప్రభుత్వంకాపులఅభ్యున్నతికి మత్స్యకారుల అభివృద్ధికిరాష్ట్ర ప్రభుత్వంకృషిచేయడం జరుగుతుందన్నారు. కావలిశాసనసభ్యులుదగుమాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వంఅందిస్తున్న సంక్షేమపథకాలుప్రతిఇంటికి అందుతున్నాయా? లేదా తెలుసుకొని,పథకాలుఅందని వారికిఅందేవిధంగాచేసేఉద్దేశంతో తొలిఅడుగుకార్యక్రమంచేపట్టడం జరిగిందన్నారు. ఒట్టూరుఅంటే తనకుప్రత్యేకఅభిమానమని ఆయనఅన్నారు. ఈరోజుసీసీ



రోడ్డుతోపాటు మంచినీటిని అందించేవిధంగాచర్యలు తీసుకోవడంజరిగిందన్నారు. రానున్నరోజులలోడ్రైనేజీలుకూడా ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా స్మశానవాటికకువెళ్లేరోడ్లనుపూర్తి చేయడంజరుగుతుందని తెలిపారు. పై కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అలేఖ్య, ఆప్కాబ్ మాజీ చైర్మన్ పాలిశెట్టి,బోగోలుమండలకన్వీనర్ మాలెపాటినాగేశ్వరావు బీదగిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## జూదం ఆడుతున్న వారిపై వన్టౌన్ సీఐ మనోహర్ ఉక్కు పాదం



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూలై 30 (శుభోదయం న్యూస్): పేకేట ఆడుతున్న వారిపై వన్ టౌన్ సీఐ మనోహర్ మంగళవారం హనుమేష్ నగర్ లోని గుట్టల ఏరియాలో పేకేటా ఆడుతున్న ఏడు మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 10.010 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు వన్టౌన్ సీఐ మనోహర్ తెలిపారు.

## భక్తులతో కిటకిటలాడుతున్న నాగులమ్మ ఆలయం.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్)కామారెడ్డి జిల్లా బీర్కూరు పట్టణ కేంద్రం లో నాగుల చవితి సందర్భంగా గాంధీ చౌక్ ప్రాంతం లో కొలువైన నాగులమ్మ ఆలయం లో భక్తులతో కిటకిటలాడింది. వందల సంఖ్యలో మహిళలు భక్తి శ్రద్దలతో వచ్చి నాగుల పంచమి సందర్భంగా పుట్టలో పాలు పోసి కొబ్బరికాయలు కొట్టి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు. అలాగే బీర్కూర్ పట్టణ కేంద్రానికి చెందిన యువకులు బూంది ప్రసాదము వితరణ చేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ యువత భక్తులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బీర్కూర్,మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):ఎస్.ఆర్.ఎన్.కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2009 - 2012 బి.ఎ. బీటెక్ మొదటిసారి ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు విచ్చేసినటువంటి విద్యార్థిని విద్యార్థులకు హృదయపూర్వక ధన్యవాదములు. మరియు గౌరవనీయులైనటువంటి సాయి రెడ్డి సార్ పొలిటికల్ సైన్స్ గారికి ప్రత్యేక ధన్యవాదములు, మరియు ఇట్టి కార్యక్రమాన్ని ముందుండి నడిపినటువంటి విద్యార్థులు నాగరాజ్, శివకుమార్, బాలు, సాయిబాబా, ప్రేమ్ సింగ్. లు మరియు పూర్వ విద్యార్థిని విద్యార్థులందరికి ప్రత్యేకమైనటువంటి ధన్యవాదములు.

## ప్రభుత్వ జిపి, పి. సుధాకర్ ను సన్మానించిన జిల్లా నాయకులు మోడం ఉమేష్ గౌడ్ పిఎసిఎస్ చైర్మన్ విజ్జన్ రావు



రేగొండ, మండల రిపోర్టర్ మంతెన సురేష్, (శుభోదయం న్యూస్) : రేగొండ మండల కేంద్రనికి చెందిన బొట్ల సుధాకర్ ను భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రభుత్వ (జిపి)గా ఇటీవల నియామకం అయ్యారు రేగొండ మండల కేంద్రానికి చెందిన బోట్ల, సుధాకర్ జిల్లా కోర్టుకు ప్రభుత్వ(జీపీ)గా నియమం కావడంతో వారి ఆఫీసులో పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి అభినందించారు. సుధాకర్ నీ శాలవతో సన్మానించారు వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఎంతో కష్టపడి చదివి ఇంత పెద్ద సాయికి రావడం సంతోషకరమన్నారు పరకల, కోర్టులో అనేక క్రిమినల్, సివిల్ కేసులలో ప్రవీణ్యం పొంది జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ న్యాయవాదిగా పదవిగా బాధ్యతలు రావడం సంతోషకరమన్నారు జిల్లా కోర్టులో నియామకం పట్ల జిల్లా నాయకులు మోడం ఉమేష్ గౌడ్, సొసైటీ చైర్మన్ నడిపెల్లి విజన్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు అభినందించారు ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, మైస బిక్షపతి, ఐలీ శ్రీధర్, గండి తిరుపతి, భాస్కర్ల రాజు, కటకం రాజు, యాకూబ్, తాజుద్దీన్, తదిరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సాంబశివరావుకు వినతి పత్రం అందజేసిన ఉద్యమకారులు




వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ పక్ష నేత శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు కు ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఉద్యమకారులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయించి ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చి దిశగా ప్రయత్నం చేయాలని ఆయను ఈ సందర్భంగా కోరారు. అనంతరం ఉద్యమకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని గత అసెంబ్లీలో ప్రస్తావించినందుకు ఆయనకు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు శీలం స్వామి,ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్,ఉద్యమ కళాకారుల జిల్లా అధ్యక్షుడు మల్లం వెంకటేశం గౌడ్,బత్తి రవీందర్ గౌడ్,ఐటి పాముల పుష్ప,ఎక్కల దేవి శ్రీనివాస్,కదిరేని స్వామి,కన్నె కంటి శ్రీనివాసచారి, కొండూరు శ్రీరాములు, దండ మల్లికార్జున్, బొడిగెసుదర్శన్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తా : ఎమ్మెల్యే శ్రీ గణేష్



తెలంగాణా స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్), జూలై 29: బోయిన్ పల్లి పరిధిలోని మర్రి రామ్ రెడ్డి కాలనీ, ఓల్డ్ సీతారాంపురం, పద్మశాలి కాలనీ, రామన్నకుంట చెరువు ప్రాంతంలోని తదితర 15 కాలనీలు ఎన్నో సంవత్సరాలుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నాల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మేరకు ఆయా కాలనీల వాసులు ఏర్పాటు చేసుకున్న సమావేశంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ను ఆహ్వానించడంతో ఎమ్మెల్యే సమావేశానికి హాజరై వారి సమస్యలను సావధానంగా వినడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ .. ఎలివేటెడ్ కారిడార్ల కోసం కంటోన్మెంట్ బోర్డు నుంచి భూమిని తీసుకోవడంతో దాని పరిహారానికి చెల్లించాల్సిన 303 కోట్లు కేంద్ర ప్రభుత్వానికి ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణమే చేపట్టకపోతే కంటోన్మెంట్ బోర్డు కు 303 కోట్ల రూపాయలు వచ్చేవే కాదు ఈ నిధులు కంటోన్మెంట్ బోర్డు కు రావడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తో పాటు కంటోన్మెంట్ బోర్డు సీఈవో మాజీ సీఈవో లైన మధుకర్ నాయక్ గారు, అజిత్ రెడ్డి గారి కృషి కూడా ఉందన్నారు. బోర్డుకు వచ్చిన 303 కోట్ల రూపాయలతో కంటోన్మెంట్ నియోజకవర్గంలో నాలాల అభివృద్ధి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ పనులకే పెద్దపీట వేస్తామని తెలిపారు. అంచెలంచెలుగా నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ బోర్ద్ మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన ప్రతాప్, కాలనీల అధ్యక్షులు సంపత్ కుమార్ రెడ్డి ,చెన్నకేశవులు, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఓబీసీ మహాసభ గోడప్రతులను ఆవిష్కరించిన సీతక్క, షబ్బీర్ అలీ



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్), జూలై 29: నీల నాగరాజు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వచ్చే నెల ఆగస్ట్ 7న గోవా రాష్ట్రంలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభ గోడప్రతులను ఆవిష్కరించిన రాష్ట్ర పంచాయితీరాజ్, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క మరియు ఎస్సీ,ఎస్టీ,ఓబీసీ,మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ. దేశంలో మొదటిసారి మండల కమీషన్ సిఫార్సులైన ఓబీసీ లకు ఉద్యోగ రంగంలో 27 శాతం రిజర్వేషన్ల్ అమలు చేస్తున్నట్లు మాజీ ప్రధాని పీవీ సింగ్ ప్రకటించిన ఆగస్ట్ 7 రోజున గోవా రాష్ట్రంలో 10వ ఓబీసీ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు 29 రాష్ట్రాల నుండి పది వేల ఓబీసీ ప్రతినిధులు హాజరువుతున్నారన్నారు. జిల్లా నుండి పెద్ద ఎత్తున బీసీ ప్రజలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాప శివరాములు,యువజన సంఘం అధ్యక్షుడు ఐరెని సందీప్,ప్రధాన కార్యదర్శి గోవర్ధన్,జిల్లా ఉపాధ్యక్షులు హఫీజ్,మాజీ జెడ్పీటీసీ కొత్తపల్లి మల్లన్న,అబ్రబోయిన రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# కృత్రిమ రచన

ఆత్మ అనేది కేవలం స్వర్గలోక సంబంధి కాదు. దానికి భౌతిక ఉనికి లేనంతమాత్రాన అది భావ వాదులకు మాత్రమే చెందినది కాదు. అదేంటో చూపలేకపోయినా, అది లేకపోవడమంటే ఏమిటో మనకు తెలుసు. ఈ మెటీరియలిస్టు ప్రపంచంలో ఆత్మగల్ల మనుషులను వెతికే ప్రయత్నం కాదిది. కృత్రిమ మేధ (ఏఐ) సందర్భంలో ఆత్మ ప్రాధాన్యతను అర్థం చేయించాలన్న ఆరాటం. మానవీయ సహజ మేధనూ, యాంత్రిక కృత్రిమ మేధనూ విడదీస్తున్నది ముఖ్యంగా ఆ ఒక్కటే!

'ఈ కంప్యూటర్ కాలంలో' అని చెప్పడం నుంచి, 'ఈ కృత్రిమ మేధ కాలంలో' అనడం వరకు పయనించాం. మానవ నాగరికత ఒక క్రమ పరిణామమే అయినా, అది ఒక్కోసారి పెద్ద అంగ వేస్తుంది. నిప్పును పుట్టించడం, విద్యుత్‌ను కనుగొనడం, ఇంటర్నెట్ లాంటి మరో విప్లవాత్మకమైన మార్పు కృత్రిమ మేధ అని పండితులు అంటున్నారు. మనిషి తాను ఎదిగే క్రమంలో ఎన్నో ఉపకరణాలనూ, సాంకేతిక పరిజ్ఞానాలనూ రూపొందించుకున్నాడు.

ఆ ఉపకరణాలు, పరిజ్ఞానాల ఊతంగా మరింత ఎదిగాడు. కానీ ఏఐ కేవలం మనిషి చేతిలో మరో పనిముట్టు కాదు, మరో అద నపు పరిజ్ఞానం అంతకన్నా కాదు. అంతకు మించి! పర్యావరణ పరిష్కారాలు సూచిస్తుందంటున్న ఏఐ టెక్నాలజీ నిజానికి అత్యధిక కార్బన్ ఫుట్‌ప్రింట్స్‌కు కారణమవుతోందనీ, జలవనరులను విపరీతంగా తోడేస్తోందనీ పర్యావరణవేత్తలు ఇప్పటికే ఆందోళన చెందుతున్నారు. కానీ ఇవేవీ ఏఐని వ్యతిరేకించడానికి తక్షణ కారణాలు కాదు. ఇతర పరిజ్ఞానాలు కనీసం మన అంచనాలో మనిషిని సుఖపెట్టడానికి రూపొందినవి. కానీ ఏఐ ఏం చేయనుందో మనకు ఏ అంచనా లేదు!

సాహిత్య ప్రపంచంలో కొంతకాలంగా ఉన్న భయం ఈ మధ్య ఒక 'ఓపెన్ లెటర్' రూపం దాల్చింది. యంత్రాలు సృష్టించిన పుస్తకాలను విడుదల చేయకూడదంటూ ఈ జూన్ నెలలో పదుల కొద్దీ రచయితలు అమెరికాలోని పెంగ్విన్ రాండమ్‌హౌజ్, హార్పర్ కొలిన్స్ లాంటి ప్రచురణకర్తలకు బహిరంగ లేఖ రాశారు.

ఏఐ%-%కల్పిత పుస్తకాలను విడుదల చేయడానికి 'రచయితల'ను సృష్టించ బోమనీ, ఒకవేళ మానవ రచయితలే అలాంటివి కల్పిస్తే వాటిని 'మారుపేర్ల'తో అనుమతించ బోమనీ, ఈ 'దొంగతనానికి' ఏ విధంగానూ మద్దతివ్వబోమనీ ప్రచురణకర్తలు ప్రతిన బూనాలని వారు కోరారు. ఒక పుస్తకం తుదిరూపు వరకు భాగమయ్యే మనుషుల ఉద్యోగాలను ఏఐ టూల్స్‌కు బలిపెట్టకూడదనీ అడిగారు.

ఘంటాలను దాటి, పెన్నుకు బదులుగా టైప్ రైటర్‌నో, కంప్యూటర్‌నో వాడటం లాంటి పరిణామం కాదిది. ఏకంగా రచయితనే పక్కకు తప్పించేది! అందుకే రచయితల అనుమతి లేకుండా, రాయల్టీలు చెల్లించకుండా రూపొందిన కృత్రిమ మేధను ప్రచురణకర్తలు వాడకూడదనే విన్నపం కూడా వీటిల్లో ఉంది. ఎటూ 'దోపిడీ'కి గురవుతున్న శ్రమకు పరిహారం కోరుకోవడం ఇది!

సాహిత్యం అంటేనే మానవ అనుభవం. లోలోపలి తరంగం, అంతరంగ జ్వలనం, ఆనంద చలనం. అవేమీ లేని ఏఐ ఎలా రాస్తుంది? 'ఎలక్ట్రిక్ గొర్రెలను కలగంటుందా ఏఐ?' అని అడుగు తాడు కవి డేవిడ్ స్టీర్. 'ఒక రచన చేస్తున్నప్పుడు రచయిత రాస్తున్న ప్రతి పదాన్నీ తెలిసో, తెలియకో ఎంపిక చేసుకుంటాడు. పది వేల పదాల కథకు పది వేల ఎంపికలు. అలాంటి స్పృహ లేనందువల్ల కృత్రిమ మేధ 'కళ'ను సృష్టించలేదంటాడు అమెరికన్ సైన్స్ ఫిక్షన్ రచయిత టెడ్ చియాంగ్. "ఒక మనిషి మీకు 'ఐ యామ్ సారీ' అని చెప్పినప్పుడు, గతంలో ఇతర జనాలు క్షమాపణ కోరుకున్నా రన్నది విషయం కాదుబీ 'ఐ యామ్ సారీ' అనేది పరిగణించాల్సినంతటి అసాధారణమైన పదబంధం కాదన్నది విషయం కాదు.

ఒకవేళ ఒకరు నిజాయితీగా చెబితే, ఆ క్షమాపణ విలువైనదీ, అర్థవంతమైనదీ అవుతుందిబీ అలాంటి క్షమాపణలు గతంలో చెప్పివున్నప్పటికీ." ఒక రచయిత రాసేది అతడిదైన లోలోపలి వాక్యం. అది అతడికి మాత్రమే ప్రత్యేకం. అతడి అనుభవమే ఆ వాక్యం రాయడానికి పురిగొల్పుతుంది. యజమానిని చూడగానే కుక్క ప్రేమగా తోక ఊపుతుంది. దాని అన్ని కండరాలూ సంతోషంతో నర్తించడాన్ని ఆ తోక ఊపు సంకేతిస్తుంది.

ఇలాంటి చిరు ఉద్వేగపు అనుభవం కూడా ఉండని ఏఐ ఏం రాయగలదు? ప్రదేశాలు, వస్తువులు మనిషి ఉనికితో ముడిపడి ప్రత్యేకమవుతాయి. ఏఐకి లేనిదే ఆ మహత్తర మానవీయ స్పర్శ. కేవలం అన్నింటినీ రుబ్బి, 'అలాగరిథమ్' వండివార్చే రచనలో ఆత్మ ఎలా ఉంటుంది? మరి, ఎటూ కళ కాకుండాపోయే ఆ ఏఐ కల్పిత కృత్రిమ రచనల పట్ల భయం దేనికి అనేది ప్రశ్న. సగటు పాఠకుడికి ఆ మీడియోకర్ రచనే బాగుందనిపించొచ్చు. ఇక అదే ప్రమాణం అయ్యి, 'అసలు'ది తీర్పునకు లోనవుతుందేమో నని ఒక సృజనాత్మక భయం! త్రిపురనేని గోపీచంద్ నవల 'పండిత పరమేశ్వర శాస్త్రి'లో ఒక పాత్రను 'సజ్జలు సజ్జలు' అని వెక్కిరిస్తారు అతడి సాహిత్య మిత్రులు. కోడి సజ్జలు తిని సజ్జలు విసర్జిస్తుంది, ఏమీ జీర్ణం చేసు కోకుండానే. ఎంతో మేధావిగా కనబడే ఆ రచయిత, ఏదీ తనలోకి ఇంకించుకోకుండానే మాటలు వల్లెవేస్తుంటాడని వారి ఉద్దేశం అనుకోవాలి. ఏఐ రచనలకు ఈ ఉదాహరణ బాగా పనికొస్తుంది.

అయితే, అసలు ఇప్పుడు ఉన్నది ఇంకా 'ఆదిమ' ఏఐ మాత్రమేననీ, మున్ముందు ఇంకా ఆధునికం అవుతుందనీ చెబుతున్నారు. అప్పుడు అది ఏ రూపం తీసుకుంటుందో! ప్రస్తుత భయం రచ యితను పక్కనపెట్టడం గురించే. మున్ముందు మనిషినే పక్కన పెట్టడం అవుతుందేమో! అప్పుడు సమస్త మానవాళి మరొక బహిరంగ లేఖ రాసుకోవాల్సి ఉంటుంది!

# నువ్వు ఏదైతే విత్తావో అదే చెట్టవుతుంది చంద్రబాబూ



తాడేపల్లి: రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని.. సీనియర్ నేతలను తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారంటూ కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఇదే సంప్రదాయం కొనసాగితే టీడీపీలో అందరూ జైలుకెళ్లాల్సిందేనని ఆయన హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. మిథున్‌రెడ్డి అరెస్ట్ బాధాకరమన్నారు. "మిథున్‌ను, గౌతం రెడ్డిని రాజకీయాల్లో నా ద్వారా వచ్చారు. నన్ను చూసి ప్రేరణ పొంది రాజకీయాల్లోకి వచ్చారు. వారి తండ్రులతో కన్నా, వీరితోనే నాకు ఎక్కువ సాన్నిహిత్యం. నన్ను చూసి వాళ్లు రాజకీయాల్లోకి వచ్చారు. రాష్ట్రంలోని అంశాలకు మిథున్‌కు ఏం సంబంధం?. మిథున్ తండ్రి పెద్దిరెడ్డిగారు ఆ శాఖను కూడా చూడలేదు. కేవలం వేధించాలన్న ఉద్దేశంతో తప్పుడు కేసులు పెట్టారు. చంద్రగిరి చంద్రబాబు సొంత నియోజకవర్గం. గతంలో చంద్రబాబు మంత్రిగా పనిచేసి చంద్రగిరిలో ఓడిపోయారు. తర్వాత ఎన్టీఆర్ కాళ్లు పట్టుకుని మళ్లీ టీడీపీలో చేరాడు. తర్వాత చంద్రగిరి నుంచి కుప్పం పారిపోయాడు. ..కుప్పం బీసీల నియోజకవర్గం కాబట్టి అక్కడికి వెళ్లిపోయాడు. చంద్రబాబు కంట్లో భాస్కర్‌రెడ్డి కంట్లో నలుసులా మారాడు. భాస్కర్ కొడుకును కూడా జైలులో పెట్టాలని కుట్రపన్నాడు. భాస్కర్ కొడుకు లండన్‌లో చదువుకుని వచ్చాడు. అలాంటి వారిమీద కూడా కేసులు పెట్టి అరెస్టు చేయాలని చూస్తున్నారు. నందిగం సురేష్, ఒక సాధారణ స్థాయి నుంచి ఎంపీగా ఎదిగాడు. గట్టిగా తన స్వరాన్ని వినిపిస్తున్నాడని 191 రోజులు జైల్లో పెట్టారు. కేసు మీద కేసు పెట్టి వేధిస్తున్నారు. కాకాణి గోవర్ధన్ మీద కూడా కేసులు మీద కేసులు పెట్టారు. టోల్‌గేట్ల వద్ద ఫీజుల వద్దకూడా వసూలు చేశారని తప్పుడు కేసు. లేని అక్రమాలు చూపించి.. తప్పుడు కేసులు పెడుతున్నారు. ఇప్పుడు మళ్లీ మరో మాజీ మంత్రి అనిల్ కుమార్ మీద తప్పుడు కేసులు పెడుతున్నారు. దీని కోసం తప్పుడు వాంగ్మూలం చెప్పించే ప్రయత్నంచేశారు. మెజిస్ట్రేట్ వద్ద తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి చెప్పాడు. పార్టీలో ఇలా ముఖ్యమైన, క్రియాశీలకంగా ఉన్నవారిపై కేసులు పెడుతున్నారు. ప్రజల తరఫున గొంతు వినిపించనీయకూడదన్నది చంద్రబాబు ఉద్దేశం. చంద్రబాబు పాలన ఘోరంగా ఉంది. అసలు పరిపాలనే కనిపించడంలేదు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా ఏ హామీలు నిలబెట్టుకోలేదు. ఘోరంగా వైఫల్యం చెందాడు కాబట్టే ఈ తప్పుడు కేసులు. మాజీ మంత్రి రోజామీత తీవ్రంగా దుర్భాషలాడారు. మన పార్టీలో ఉన్న మహిళలకు ఆత్మగౌరవం ఉండదా?. బీసీ మహిళ, కృష్ణాజడ్పీ ఛైర్మన్ హారిక మీద నేరుగా దాడులు చేశారు. నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిమీద హత్యాయత్నమే లక్ష్యంగా దాడులు చేశారు. ఆ రోజు ప్రసన్న ఇంట్లో ఉండి ఉంటే.. ఆయన పరిస్థితి ఏంటి?. రాడ్లతో, కర్రలతో దాడులు చేశారు. తాడిపత్రి నియోజకవర్గ హెడ్ క్వార్టర్‌కు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వెళ్లలేకపోతున్నాడు.

ఏకంగా సీఐ గన్ చూపించి మనుషులను భయపెట్టే ప్రయత్నంచేస్తున్నాడు. కొంతమంది డీఐజీలు, పోలీసు అధికారులు అవినీతిలో భాగస్వామ్యం అయ్యారు. ఈ కొంతమంది పోలీసులు కలెక్షన్ ఏజెంట్లుగా మారారు. అధికారపార్టీ ఎమ్మెల్యేలకు కలెక్షన్లు పంచుతున్నారు. ముఖ్య నేతకు, ముఖ్య నేత కొడుక్కి.. కలెక్షన్లు పంచుతున్నారు. వ్యవస్థీకృతంగా అవినీతి జరుగుతోంది. బెల్టుషాపులకు వేలం పాటలు వేస్తున్నారు. ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా, క్వార్ట్జ్, సిలికా, లెటరైట్ మాఫియాలు జరగుతున్నాయి. కొంతమంది పోలీసు అధికారుల సహాయంతో అవినీతిపై పంచాయతీలు చేయిస్తున్నారు. మనం ఎప్పుడూ చూడని విధంగా అవినీతి జరుగుతోంది

..రేషన్ బియ్యం మాఫియా కొనసాగుతోంది. పేకాట క్లబ్బులు నడుస్తున్నాయి. కొంతమంది డీఐజీలు కలెక్షన్ ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంత అధ్వాన్నమైన పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని, ఇప్పుడు రాష్ట్రాన్ని అమ్మాలి అంటున్నారు, ఇంతకన్నా పచ్చిమోసం ఉంటుందా?. ఫీజురియింబర్స్ మెంట్ ఇవ్వకపోవడం వల్ల పిల్లల చదువులు మానేస్తున్న పరిస్థితులు వచ్చాయి. రూ.4200 కోట్లు పీజు రియింబర్స్ మెంట్ బకాయలు ఉన్నాయి, ఆరు క్వార్టర్లనుంచి పెండింగ్. వసతీ దీవెన కింద రూ.2200 కోట్లు బకాయిలు ఉన్నాయి.

వైఎస్ జగన్ భద్రతపై పీఏసీ సమావేశంలో ఆందోళన

..ఆరోగ్యశ్రీ బిల్స్ నెలకు రూ.300 కోట్ల చొప్పున, రూ.4200 కోట్లు పెండింగ్. ఆరోగ్య ఆసరా కింద ఒక్క పైసా ఇవ్వడంలేదు. నెట్ వర్క్ ఆస్పత్రులు చేతులు ఎత్తివేశాయి. ఏ రైతుకూ, ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. రైతులను పరామర్శించడానికి వెళ్తే కేసులు పెడుతున్నారు. ఉచిత పంటల బీమా తీసేశారు. ఆర్బీకేలు, ఇ- క్రాప్ నిర్వీర్యం. నాడు-నేడు పనులు ఆగిపోయాయి. స్కూళ్లు మూసేస్తున్నారు. రాష్ట్రంలో అసలు పాలన ఎక్కడుంది?. రెండేళ్లపాటు కోవిడ్ ఉన్నా.. మనం ప్రజలకు మెరుగైన సంక్షేమం అందించాం.

..ఐదేళ్లలో మనం చేసిన అన్నిరకాల అప్పులు రూ.3.32 లక్షల కోట్లు చేశాం. ఈ 14 నెలల్లో చంద్రబాబు అందులో 52 శాతం వెళ్లాడు. ఏ పథకం లేదు. ఏ స్కీమూ లేదు. కేవలం దోచుకున్న డబ్బులు దాచుకోవడానికి మాత్రమే సింగపూర్ పర్యటన. పోర్టులు, హార్బర్లు కట్టాం, స్కూళ్లు బాగుచేశాం, ఆర్బీకేలువ కట్టాం, సచివాలయాలు కట్టాలం, విలేజ్ క్లినిక్స్ కట్టాం, మెడికల్ కాలేజీలు కట్టాం. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడంలేదు, అంతా దోచుకుంటున్నారు. దేశం ఆదాయం సగటున 12 శాతం పెరిగితే, రాష్ట్రం ఆదాయాలు 3శాతంకూడా పెరగడంలేదు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాలు ఆయన జేబులోకి పోతున్నాయి.

.పార్టీ తరఫున త్వరలో యాప్ విడుదలచేస్తాం. ప్రభుత్వ వేధింపులు జరిగినా, అన్యాయం జరిగినా.. వెంటనే యాప్‌లో నమోదు చేయవచ్చు. పలానా వ్యక్తి, పలానా అధికారి కారణంగా అన్యాయంగా ఇబ్బంది పడ్డానని చెప్పొచ్చు. ఆధారాలు కూడా ఆ యాప్‌లో పెట్టొచ్చు. ఆ ఆధారాలన్నీకూడా అప్‌లోడ్ చేయొచ్చు. ఆ కంప్లైంట్ ఆటోమేటిగ్‌గా మన డిజిటల్ సర్వర్లోకి వచ్చేస్తోంది. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆఫిర్యాదులపై కచ్చితంగా పరిశీలన చేస్తాం. అన్యాయానికి గురైన వారంతా ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చు.

..ఆధారాలుగా ఉన్న వీడియోలు, పత్రాలను అప్‌లోడ్ చేయొచ్చు. ఈ ఫిర్యాదులపై పరిశీలన జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. తప్పు చేసిన వారందరికీ సినిమా చూపించడం ఖాయం. చంద్రబాబు ఏదైతో విత్తారో అదే చెట్టవుతోంది. రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో.. కార్యక్రమం కింద బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ.. కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. మండలాల్లో కూడా దాదాపుగా పూర్తికావొచ్చింది. 90 నియోజకవర్గాల్లో గ్రామస్థాయిలోకూడా ప్రారంభమై ముమ్మరంగా సాగుతోంది. వచ్చే నెలలో రచ్చబండ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో బాబు ష్యూరిటీ %-% మోసం గ్యారంటీ కార్యక్రమం ఉద్ధృతంగా చేయాలి. క్యూ ఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు, ప్రతి కుటుంబానికీ ఎంత బాకీ పడ్డాడో చెప్పాలి

..పీఏసీ సభ్యులు ఈ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనాలి. పీఏసీ సభ్యులంతా సీనియర్ లీడర్లు. మీ అనుభవాన్ని పార్టీ కార్యక్రమాలకు జోడించాలి. పార్టీని క్రియాశీలంగా నడిపే బాధ్యతను తీసుకోవాలి. గ్రామ స్థాయిలో మనం కమిటీలను కూడా ఏర్పాటు చేసుకుంటున్నాం. రచ్చబండ కార్యక్రం ద్వారా కమిటీల ఏర్పాటు కూడా ఉద్ధృతంగా సాగుతోంది. దీన్ని నాయకులంతా పర్యవేక్షణ పరిశీలన చేయాలి. గ్రామ స్థాయిలో ఉన్న ప్రతి కార్యకర్తా పార్టీ సంస్థాగత నిర్మాణంలోకి రావాలి. బాబుష్యూరిటీ, మోసం గ్యారంటీ కింద గ్రామస్థాయిలో జరుగుతున్న రచ్చబండ కార్యక్రమం చాలా పగడ్బందీగా జరగాలి.

.ప్రతి గ్రామంలోనూ జరగాలి, అక్కడే గ్రామ కమిటీల నిర్మాణం జరగాలి. ఇది కచ్చితంగా నూటుకు నూరుశాతం జరగాలి. మంచి ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నామన్న భావన ప్రజల్లో బాగా వెల్లడవుతోంది. ఇస్తానన్న బిర్యానీ లేదు. ఉన్న పలావూ పోయింది. అందుకే మన కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోంది. పార్టీ నిర్మాణ కార్యక్రమాల్లో పీఏసీ సభ్యులంతా భాగస్వాములు కావాలి. పీఏసీ సభ్యులంతా క్రియాశీలకంగా వ్యవహరించాలి. ప్రతి కార్యక్రమంలో పాలు పంచుకోవాలి. పెద్దరికంతో కలుపుగోలుగా ఉండాలి. పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా తీసుకోవాలి. అందరం ఐక్యతతో పనిచేయాలి.

..పార్టీ పరంగా ఉన్న వ్యవస్థలను ఉపయోగించుకోవాలి. చిన్న చిన్న విభేదాలను రూపుమాపి అందర్నీ ఒక్కతాటిపైకి తీసుకు రావాలి. పార్టీని బలోపేతం చేసుకోవడానికి ఇదో మంచి అవకాశం. పార్టీకోసం కష్టపడేవారు ఎవరన్నది ఇప్పుడే బయటకు వస్తుంది. పార్టీలో మంచి గుర్తింపు పొందడానికి ఇదొక అవకాశం. గ్రామ కమిటీలు అయ్యాక బూత్ కమిటీలు వేయాలి. ఈసారి కార్యకర్తలకు పెద్దపీట. మరో 30 ఏళ్లు పార్టీ బలంగా సాగేలా కార్యకర్తలకు తోడుగా, అండగా ఉంటాం. కోవిడ్ కారణంగా ఆశించినంతగా మనం వారికి చేయలేకపోయాం. రెండేళ్లపాటు కోవిడ్ సంక్షోభంతో చాలా ఇబ్బందులు పడ్డాం. వందేళ్లకు ఒకసారి వచ్చే కోవిడ్ లాంటి మహమ్మారిని చాలా ప్రభావంతంగా హేండిల్ చేశాం. ప్రజలను బాగా ఆదుకున్నాం.

..కార్యకర్తల విషయంలో గతంలోలా కాదు. కచ్చితంగా వారికి పెద్ద పీట ఉంటుంది. ప్రస్తుతం గ్రామ కమిటీల మీద దృష్టిపెట్టాలి. తర్వాత బూత్‌కమిటీల మీద దృషిపెట్టాలి. ప్రతి గ్రామంలోనూ సోషల్‌మీడియా ఉండాలి. అలాగే గ్రామాల వారీగా అనుబంధ విభాగాలు ఉండాలి. కమిటీల ఏర్పాటు వల్ల క్రియాశీలక కార్యకర్తలను చైతన్యం చేసినట్టు అవుతుంది. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేస్తారు, పార్టీ నిర్మాణంలో, కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటారు. పార్టీ కమిటీల్లో ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి" అని వైఎస్ జగన్ చెప్పారు.

వైఎస్ జగన్ భద్రతపై పీఏసీ సమావేశంలో ఆందోళన

వైఎస్ జగన్ భద్రతపై పీఏసీ సమావేశంలో ఆందోళన వ్యక్తమమైంది. జరుగుతున్న పరిణామాలు చూస్తే చాలా ఆందోళనకరంగా ఉందని పీఏసీ సభ్యులు తెలిపారు. "మీరు భద్రంగా ఉంటేనే మేం, ప్రజలు బాగుంటాం. ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే వైయస్.జగన్ భద్రతపై సమస్యలు సృష్టిస్తోంది. ఏ పర్యటన చూసినా భద్రతా లోపాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. భద్రత విషయంలో ఉపేక్షించడం కరెక్టు కాదు. మీ భద్రత విషయంలో కొత్త కొత్త వార్లు వింటున్నాం. మా అందరికీ చాలా ఆందోళన కరంగా ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది" అని ఇందులో రాజీ వద్దని పీఏసీ సభ్యులు.. జగన్‌కు సూచించారు. బంగారుపాళ్యం సహా ఇతర పర్యటనల్లో భద్రత విషయంలో పోలీసులు, ప్రభుత్వం కావాలనే రాజీ పడిందన్నారు.

# చిప్స్, కుకీస్ తినడం డ్రగ్ అడిక్షన్‌తో సమానం!

## వెల్లడించిన తాజా అధ్యయనం

## డ్రగ్స్, ఆల్కహాల్, పొగాకు లాగే బానిసలుగా మార్చగలవని వెల్లడి

## దేశంలో వేగంగా పెరుగుతున్న అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగం



మీరు చిప్స్, కుకీస్, ఐస్‌క్రీమ్, చాక్లెట్ వంటి అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్ (యూపీఎఫ్‌ఎస్) ఎక్కువగా తింటున్నారా? అయితే జాగ్రత్త! ఇవి మిమ్మల్ని డ్రగ్స్, ఆల్కహాల్, పొగాకు లాగే బానిసలుగా మార్చగలవని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. ఈ ఆహారాలు సబ్‌స్టెన్స్ యూజ్ డిజార్డర్స్ (వ్యసనాలు)తో సమానమైన వ్యసన కారకాలుగా మారుతున్నాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.



అధ్యయనం ఏం చెబుతోంది?

మిచిగాన్ విశ్వవిద్యాలయ పరిశోధకురాలు ఆష్లే గియర్‌హార్ట్ నేతృత్వంలో 36 దేశాలలో జరిగిన 281 అధ్యయనాలను విశ్లేషించారు. ఈ పరిశోధనల్లో ప్రపంచవ్యాప్తంగా 14 శాతం మంది పెద్దలు, 12 శాతం మంది పిల్లలు ఈ అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్‌కు బానిసలవుతున్నారని తేలింది. ఈ అడిక్షన్ రేట్లు ఆల్కహాల్ (14శాతం), పొగాకు (18శాతం) వంటి పదార్థాలకు ఉన్న వ్యసన రేట్లతో దాదాపు సమానంగా ఉన్నాయి.

మెదడుపై ప్రభావం: అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో ఉండే అధిక చక్కెర, ఉప్పు, కొవ్వులు మెదడులోని రివార్డ్ సిస్టమ్‌ను ప్రేరేపిస్తాయి. ఇది కొకైన్ లేదా ఆల్కహాల్ వంటి డ్రగ్స్‌కు సమానమైన ప్రభావాన్ని చూపుతుందని అధ్యయనం పేర్కొంది.

డోపమైన్ విడుదల: ఈ ఆహారాలు మెదడులో డోపమైన్ విడుదలను పెంచుతాయి. డోపమైన్ అనేది ఆనందం, రివార్డ్‌లతో ముడిపడి ఉన్న రసాయనం. ఇది వ్యక్తులు ఈ ఆహారాలను పదే పదే తినాలని కోరుకునేలా చేస్తుంది.

వ్యసన లక్షణాలు: ఈ ఆహారాలు తినడం వల్ల క్రేవింగ్స్ (తీవ్రమైన కోరిక), నియంత్రణ కోల్పోవడం, ఉపసంహరణ లక్షణాలు (అంటే ఆ ఆహారం లేనప్పుడు చిరాకు లేదా ఆందోళన) వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి డ్రగ్ వ్యసనంలో కనిపించే లక్షణాలకు చాలా దగ్గరగా ఉంటాయి. పిల్లలలో ప్రమాదం: పిల్లలలో కూడా 12 శాతం మంది ఈ ఆహారాలకు బానిసలవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇది వారి భవిష్యత్ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫుడ్ అడిక్షన్ భావనను అందరూ అంగీకరించనప్పటికీ, కొందరు పరిశోధకులు ఆహారాన్ని డ్రగ్స్‌తో పోల్చడం సరికాదని వాదిస్తున్నారు. కానీ ఆష్లే గియర్‌హార్ట్ వంటి వారు ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల్లోని చక్కెర, ఉప్పు, కొవ్వుల ప్రత్యేక కలయిక సహజ ఆహారాల కంటే భిన్నమైన, వ్యసన కారక ప్రభావాన్ని చూపుతుందని అంటున్నారు. ఈ వ్యసనానికి చికిత్సగా, సబ్‌స్టెన్స్ యూజ్ డిజార్డర్స్‌కు ఉపయోగించే ఔషధాలు (ఉదా: నాల్ట్రెక్సోన్, బుప్రోపియన్), గ్లూకాగన్-లైక్ పెప్టైడ్-1 (జీఎల్‌పీ-1) అగోనిస్టులు సహాయపడవచ్చు. అలాగే, కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (సీబీటీ) కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. మన దేశంలో అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా యువతలో. ఇది ఊబకాయం, డయాబెటిస్, గుండె జబ్బులు వంటి ఆరోగ్య సమస్యలను పెంచుతోంది. ఈ అధ్యయనం ప్రకారం ఫుడ్ ఇండస్ట్రీపై కఠిన నిబంధనలు విధించడం, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) ద్వారా లేబులింగ్, మార్కెటింగ్ నిబంధనలను కఠినతరం చేయడం అత్యవసరం. స్కూళ్లలో ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఈ సమస్యను తగ్గించవచ్చు.

**ఈ అధ్యయనం ఫుడ్ అడిక్షన్‌ను అధికారికంగా ఒక డిజార్డర్‌గా గుర్తించి, బాధితులకు సరైన చికిత్స, మద్దతు అందించాలని సూచిస్తోంది.**

## కాల్పుల విరమణను ఉల్లంఘించిన కంబోడియా : థాయ్ ఆర్మీ



సురిన్ : కాల్పుల విరమణను కంబోడియా ఉల్లంఘించిందని థాయిలాండ్ ఆర్మీ మంగళవారం వెల్లడించింది. పూర్తిగా అటవీ ప్రాంతంతో కూడిన తమ సరిహద్దులో దాడులు కొనసాగుతున్నాయని పేర్కొంది. సోమవారం మలేషియాలో జరిగిన శాంతి చర్చల తర్వాత, అర్థరాత్రి నుండి కాల్పుల విరమణ ప్రారంభమవుతుందని ఇరుదేశాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చే సమయంలో, కంబోడియా దళాలు తమ భూభాగంలోని అనేక ప్రాంతాల్లో సాయుధ దాడులు ప్రారంభించినట్లు తమ వర్గాలు గుర్తించాయని థాయిలాండ్ ఆర్మీ ప్రతినిధి వింథాయ్ సువారీ అన్నారు. ఇది ఒప్పందాన్ని ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడమే కాకుండా పరస్పర విశ్వాసాన్ని దెబ్బతీసే స్పష్టమైన ప్రయత్నం అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. థాయిలాండ్ తగిన విధంగా స్పందిస్తుందని, ఆత్మరక్షణ కోసం తమ చట్టబద్ధమైన హక్కును వినియోగించుకుంటుందని అన్నారు. ఈ వార్తలను కంబోడియా ఖండించింది. అర్థరాత్రి 12 గంటలకు కాల్పుల విరమణ తర్వాత ఆర్మీని వెనక్కి రప్పించినట్లు కంబోడియా ప్రధాని హున్ మానెట్ పేర్కొన్నారు.

## అమిత్‌షా ఎందుకు రాజీనామా చేయలేదు



న్యూఢిల్లీ : పహల్గాం దాడికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎందుకు రాజీనామా చేయలేదని మంగళవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ కేంద్రాన్ని నిలదీశారు. పార్లమెంట్‌లో ఆపరేషన్ సిందూర్ చర్చ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడికి దారితీసిన నిఘా వైఫల్యాన్ని, ఒక ప్రసిద్ధ పర్యాటక కేంద్రాన్ని భద్రతా సిబ్బంది కాపలా లేకుండా ఎందుకు వదిలివేశారని ప్రశ్నించారు. పహల్గాం దాడికి ముందు ఈ ఉగ్రవాదులను భద్రతా దళాలు ఎందుకు గుర్తించలేదు. ఈ ప్రభుత్వంపై విశ్వాసంతో బైసారన్‌కు వెళ్లిన 26మంది పౌరులను గాలికి వదిలివేసిందని అన్నారు. 2019లో ఏర్పాటైన టిఆర్ఎఫ్ 25 ఉగ్రదాడులకు పాల్పడి ఆర్మీ అధికారులు, పౌరులు మరియు పోలీసులను చంపింది. టిఆర్ఎఫ్‌ను 2023లోనే ఉగ్రవాద సంస్థగా ప్రకటించారు. ఈ భద్రతా వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఎవరైనా రాజీనామా చేశారా అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. బిజెపి ఎంపిలు నెహ్రూ గురించి ప్రస్తావించగా.. ప్రియాంక మండిపడ్డారు. మీరు గతం గురించి మాట్లాడుతున్నారని, తాము వర్తమానం గురించి మాట్లాడుతున్నామని అన్నారు. మీరు అధికారంలో ఉన్న 11ఏళ్లకైనా బాధ్యత వహించాలని అన్నారు. 26/11 దాడులకు బాధ్యత వహిస్తూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి, హోంమంత్రి రాజీనామా చేశారని, ఉగ్రవాదులందరినీ అక్కడికక్కడే మట్టుబెట్టారని కేంద్రానికి గుర్తు చేశారు.

## పహల్గాం దాడి ఉగ్రవాదులు మృతి

### లోక్‌సభలో అమిత్‌షా వెల్లడి



న్యూఢిల్లీ : లోక్‌సభ మంగళవారం ఆపరేషన్ సిందూర్, పహల్గాం దాడులపై చర్చను కొనసాగిస్తోంది. పహల్గాం దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లోక్‌సభకు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌తో పహల్గాం దాడి సూత్రధారులకు ప్రధాని మోడీ తగిన సమాధానమిచ్చారని అమిత్‌షా పేర్కొన్నారు. పహల్గాం దాడి తర్వాత 1055మందికి పైగా సాక్షులను ఎన్ఐఎ విచారించిందని అన్నారు. ఒక బషీర్, పర్వేజ్ ఈ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారని, ఎకె-47, ఎంఐ-9 కార్బైడ్ తుపాకులతో కాలినడకన వారు బైసారన్‌కు చేరుకున్నారని అన్నారు. ఆపరేషన్ మహదేవ్‌లో ఈ ముగ్గురు ఉగ్రవాదులు మరణించారని, వారికి ఆశ్రయం కల్పించిన స్థానికులను అరెస్ట్ చేశారని అన్నారు. ఈ ఉగ్రవాదులు ఎపిసిఒ ఉగ్రదాడికి కూడా పాల్పడ్డారని అన్నారు. ఉగ్రవాదులకు సంబంధించిన పాకిస్తానీ ఓటరు ఐడి, తుపాకీ లైసెన్స్‌లు మరియు పాకిస్తానీలో తయారైన చాక్లెట్లు ఉన్నాయని అన్నారు. ఒక మాజీ హోంమంత్రి పాకిస్తాన్ క్లీన్ చిట్ ఇచ్చి, ఆధారాలు లేకుండా పాకిస్తాన్‌పై ఎందుకు దాడి చేశామని ప్రశ్నించారని కాంగ్రెస్ ఎంపి చిదంబరంను ఉద్దేశించి అన్నారు. 130 కోట్ల మంది భారతీయ పౌరులు మిమ్మల్ని క్షమించరని కాంగ్రెస్‌ఎంపిని అమిత్‌షా హెచ్చరించారు. వివిధ అంశాలపై చర్చ కోరుతూ ఇచ్చిన వాయిదా తీర్మానాలను రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తిరస్కరించారు. దీంతో ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వాయిదా అభ్యర్థనలు చైర్మన్ ఇచ్చిన వివరణాత్మక ఆదేశాలకు అనుగుణంగా లేవని డిప్యూటీ చైర్మన్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేయడంతో.. ఆయన సభను మధ్యాహ్నం 2.00గంటలకు వాయిదావేశారు.

## ఢిల్లీలో భారీ వర్షాలు ..
## విమాన కార్యకలాపాలకు అంతరాయం



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం ఉదయం నుండి భారీ వర్షం కురుస్తోంది. దీంతో పలు రహదారులు జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విమాన రాకపోకలకు కూడా అంతరాయం కలిగింది. ఈదురుగాలుల కారణంగా విమాన కార్యకలాపాలకు ఇబ్బందులు ఉండవచ్చని ఎయిరిండియా తెలిపింది. ప్రయాణికులు విమానాశ్రయానికి వెళ్లే ముందు విమాన సమయాన్ని నిర్ధారించుకోవాలని, అదనపు సమయాన్ని కేటాయించుకోవాల్సి వుంటుందని ఎయిరిండియా ఎక్స్‌లో పేర్కొంది. ఢిల్లీ మరియు ధర్మశాలలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నట్లు స్పైస్ జెట్ కూడా పేర్కొంది. ఢిల్లీకి భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఢిల్లీ అంతటా, ఎన్‌సీఆర్ ప్రాంతాలకు అలర్ట్ జారీ చేసింది. రానున్న గంట లేదా రెండు గంటల్లో తీవ్రమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆగస్ట్ 4 వరకు దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి అంచనా వేసిన సంగతి తెలిసిందే. రానున్న రోజుల్లో వాయువ్య, ఈశాన్య మరియు తూర్పు భారతదేశంలో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

## భూకంపం వస్తోంది.. జాగ్రత్త..!

### ఆండ్రాయిడ్ ఫోన్లలో 'ప్రకంపనల' హెచ్చరిక
### 5 ఏళ్ల కిందటే అందుబాటులోకి తెచ్చిన గూగుల్
### 98 దేశాల్లో 79 కోట్ల మందికి అలర్ట్స్ జారీ
### ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల ఫోన్లలో ఏఈఏ

ఫోన్ అంటే కాల్స్, మెసేజెస్, వినోదమేనా? అంతకు మించి.. చూడ్డానికి చిన్న పరికరమే కావొచ్చు కానీ కొన్ని సందర్భాల్లో ప్రాణాలను కాపాడే సంజీవని కూడా. అవును మీరు చదువుతున్నది నిజమే. భూకంప కేంద్రం నుంచి తీవ్రత చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించేలోపే.. విపత్తు రాబోతోందని యూజర్లను హెచ్చరించే వ్యవస్థ ఆండ్రాయిడ్ ఫోన్లలో ఉంది. మొబైల్‌లోని యాక్సిలరేషన్ సెన్సార్ల ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ ప్రపంచంలో భూకంప ప్రభావిత ప్రాంతాలలో నివసించే ప్రజలకు సందేశాల రూపంలో హెచ్చరిస్తోంది. ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ (ఏఈఏ) వ్యవస్థను ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసిన టెక్నాలజీ దిగ్గజం గూగుల్ 2020 నుంచి ఆండ్రాయిడ్ ఫోన్లలో పరిచయం చేసింది. ప్రాథమిక (ప్రైమరీ వేవ్స్), ద్వితీయ (సెకండరీ వేవ్స్) భూకంప తరంగాలను ఈ వ్యవస్థ గుర్తిస్తుంది. ఏఈఏ సిస్టమ్ ఇప్పటి వరకు 98 దేశాలలో భూకంప ప్రభావిత ప్రాంతాలలో నివసించే ప్రజలకు హెచ్చరికలను పంపింది. ఇప్పటి వరకు 18,000 పైచిలుకు భూకంప సంఘటనలకు సంబంధించి 79 కోట్లకుపైగా అలర్ట్స్ జారీ చేసింది. ఈ వ్యవస్థ ఇప్పుడు నెలకు సగటున 60 హెచ్చరికలను పంపుతోంది. దాదాపు 1.8 కోట్ల మంది కనీసం ఒక హెచ్చరికనైనా అందుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల మంది ఆండ్రాయిడ్ యూజర్లకు ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. గూగుల్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బర్కిలీ సీస్మాలజీ ల్యాబొరేటరీ మూడు సంవత్సరాలుగా ఈ వ్యవస్థ పనితీరు, పద్ధతులను వివరిస్తూ డేటాను విడుదల చేశాయి.

### సెకన్ల ముందు హెచ్చరిక..

భూకంపం వచ్చే కొన్ని సెకన్ల ముందు యూజర్లకు ఏఈఏ హెచ్చరిక సందేశాన్ని పంపుతుంది. భూకంప తీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉంటే 'మీరు జాగ్రత్త' అని, ముప్పు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంటే ఆడియో రూపంలో వార్నింగ్‌తోపాటు పారాహుషార్ అంటూ హెచ్చరిస్తుంది. భూ ప్రకంపనలను



గుర్తించడానికి ఫోన్‌లోని యాక్సిలరోమీటర్ సాయంతోనే భూ ప్రకంపనలను ఈ వ్యవస్థ గుర్తిస్తుంది. భూకంప తరంగాలు ఫోన్‌ను చేరగానే ఆ సమాచారాన్ని గూగుల్ సర్వర్లకు పంపుతుంది. ఒక ప్రాంతంలోని ఇతర ఫోన్ల నుంచి కూడా ఇలాంటి సమాచారమే వస్తే భూకంపం సంభవించినట్టు గూగుల్ నిర్ధారిస్తుంది. అత్యంత తీవ్రంగా భూమి కంపించకముందే ప్రభావిత ప్రాంతంలో.. ఆండ్రాయిడ్ ఫోన్‌ను వాడుతున్న వారికి ఈ వ్యవస్థ హెచ్చరికలను పంపుతుంది. భూకంప తరంగాల కంటే వేగంగా హెచ్చరికలను ప్రసారం చేయడానికి ఏఈఏ కాంతి వేగాన్ని ఉపయోగిస్తుంది.

### యూఎస్‌తో మొదలు..

ఏఈఏ వ్యవస్థ తొలుత 2020లో యూఎస్‌లో మొదలైంది. 2021లో న్యూజిలాండ్, గ్రీస్‌లో, ఆ తర్వాత మిగిలిన దేశాలకు విస్తరించారు. ఈ వ్యవస్థ హెచ్చరించిన సంఘటనల్లో 2023లో టర్కీ-సిరియా (రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.8), ఫిలిప్పీన్స్ (6.7), నేపాల్ (5.7), 2025 ఏప్రిల్‌లో టర్కీలో 6.2 తీవ్రతతో సంభవించిన భూకంపాలు ఉన్నాయి. ఇప్పటివరకు గుర్తించిన సంఘటనలలో 2,000 కంటే ఎక్కువ తీవ్ర భూకంపాలు ఉన్నాయి. ఇక ఏఈఏ బృందం 2023 ఫిబ్రవరి-2024 ఏప్రిల్ మధ్య 15 మందిని సర్వే చేస్తే.. 79% మంది ఈ హెచ్చరికలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. భూకంపం రాకముందే హెచ్చరిక అందుకున్నట్టు 5.4 లక్షల మంది చెప్పడం విశేషం.

### కోట్లాది మందికి..

2023 నవంబర్‌లో ఫిలిప్పీన్స్‌లో 6.7 తీవ్రతతో భూకంపం సంభవించినప్పుడు.. భూకంపం ప్రారంభమైన 18.3 సెకన్ల తర్వాత ఈ వ్యవస్థ మొదటి హెచ్చరికను పంపింది. అత్యంత తీవ్ర ప్రకంపనలు సంభవించిన భూకంప కేంద్రానికి దగ్గరగా ఉన్నవారికి 15 సెకన్లపాటు మెసేజులు పంపారు. దూరంగా ఉన్నవారికి, తక్కువ ప్రకంపనలు వచ్చిన ప్రాంత యూజర్లకు ఒక నిమిషంపాటు అలర్ట్స్ జారీ చేశారు. ఇలా మొత్తంగా 25 లక్షల మందిని అప్రమత్తం చేశారు. 2023 నవంబర్‌లో నేపాల్‌లో 5.7 తీవ్రతతో భూకంపం వచ్చినప్పుడు కోటి మందికిపైగా హెచ్చరికలు అందాయి. 2025 ఏప్రిల్‌లో టర్కీలో భూమి కంపించడం ప్రారంభమైన 8 సెకన్ల తర్వాత మొదటి అలర్ట్ జారీ అయింది. ఈ ఘటనలో 1.1 కోట్ల మందికిపైగా ఈ సందేశాలు అందుకున్నారు. అలర్ట్స్ అందుకోవాలంటే వినియోగదారులు వైఫై లేదా సెల్యులార్ డేటా కనెక్టివిటీని కలిగి ఉండాలి. ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్, లోకేషన్ సెట్టింగ్స్ రెండూ ఆన్‌లో ఉండాలి. భూకంప తీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉంటే 'మీరు జాగ్రత్త' అని, ముప్పు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంటే ఆడియో రూపంలో వార్నింగ్‌తోపాటు పారాహుషార్ అంటూ హెచ్చరిస్తుంది.

## సభలో సిందూరం

### ఆపరేషన్ సిందూర్‌పై వాడీవేడీ చర్చ
### పార్లమెంట్‌లో సోమవారం కొనసాగిన రభస
### బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చ చేపట్టాలని
### రాజ్యసభలో పట్టుబట్టిన విపక్షసభ్యులు
### పార్లమెంట్ మకర ద్వారం ముందు
### విపక్షాల ఆందోళనలు

న్యూఢిల్లీ: పహల్గాం ఉదంతం, ఆపరేషన్ సిందూర్‌పై తక్షణం చర్చ జరపాలన్న విపక్షాల డిమాండ్లకు తలొగ్గి సోమవారం వివరణలతో చర్చను మొదలెట్టిన అధికార పక్షం, ప్రభుత్వ వివరణను తీవ్రంగా తప్పుబడుతూ విపక్షసభ్యులు చేసిన నినాదాలతో పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. ప్రభుత్వం తరఫున రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లు లోక్‌సభలో సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వాదనను బలంగా వినిపించారు. ఇదేసమయంలో జైశంకర్ ప్రసంగాన్ని విపక్ష సభ్యులు అడ్డుకోవడం, అడ్డుకున్నందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యంచేసుకుని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడంతో సభలో ఆగ్రహావేశాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఓవైపు ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతుండగానే బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణపైనా చర్చ జరపాలని విపక్ష సభ్యులు రాజ్యసభలో పట్టుబట్టారు. దీంతో సభ పలుమార్లు వాయిదాపడి చివరకు అర్థాంతరంగా ముగిసి మంగళవారానికి వాయిదాపడింది.

### పాక్ కాళ్లబేరానికి వచ్చింది

తొలుత లోక్‌సభలో ఆపరేషన్‌సిందూర్‌పై చర్చపై రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. " ఆపరేషన్ సిందూర్ అనేది ముమ్మాటికీ చరిత్రాత్మకమైన సైనిక చర్య. ఉగ్రవాదంపై అత్యంత ప్రభావవంతమైన భారత విధానాన్ని ఈ ఆపరేషన్ ప్రపంచానికి చాటింది. యుద్ధరంగంలో తమ ధైర్యసాహసాలను ప్రదర్శించిన ధైర్యవంతులైన సైనికులందరికీ నా సెల్యూట్. పాక్ పౌరులకు, వారి ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పక్కా ప్రణాళికతో ఈ ఆపరేషన్‌కు పథకరచన చేశారు. కేవలం ఉగ్రవాదులకే భారీ నష్టం చేకూర్చాం. కేవలం 22 నిమిషాల్లో 9 కీలక ఉగ్రస్థావరాలపై మెరుపుదాడి చేసి మన సత్తా చాటాం. ఊహించని మెరుపుదాడితో చేష్టలుడిగిన పాక్ డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్(డీజీఎంఓ) స్వయంగా ఫోన్ చేసి తమకు ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశ్యంలేదని స్పష్టంచేశారు. ఆలోపు పాక్ జరిపిన డ్రోన్, క్షిపణి దాడులను మన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలు విజయవంతంగా నిర్వీర్యంచేశాయి. మన దాడులకు ప్రతీగా పాక్ జరిపిన దాడుల్లో భారత్‌లో ఏ ఒక్క కీలక స్థావరం, ఆయుధాగారం దెబ్బ తినలేదు. ఉగ్రవాదుల స్థావరాలు, వాళ్లకు మద్దతిచ్చేవాళ్లను అంతంచేసేందుకే ఆ ఆపరేషన్. లక్ష్యం నెరవేరిన కారణంగానే ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశాం. ఇందులో ఎవరి బలవంతం, ప్రోద్బలం, ప్రమేయం లేవు. బయటిశక్తుల (అమెరికా, ట్రంప్) కారణంగానే పాక్‌పై మనం దాడులను ఆపేశామనడంలో వాస్తవం లేదు. భారత వాయుసేన అసాధారణ దాడులు, సరిహద్దు వెంట ఆర్మీ దీటైన జవాబుకు తోడు నావికాదళం దాడులకు దిగొచ్చన్న భయాలతో పాక్ కాళ్లబేరానికొచ్చింది" అని రాజ్‌నాథ్ స్పష్టంచేశారు. "మమ్మల్ని విపక్షాలు అడగదల్చుకుంటే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందా? అని ఒక్కటే ప్రశ్న వేయాలి. అందుకే మేం అవును అని సూటి సమాధానం చెప్తాం. పాక్ దాడుల్లో మన సైనికులెవరూ వీరమరణం పొందలేదు. ఏ పరీక్షలోనైనా



ఫలితమే ముఖ్యం. పరీక్ష రాసేటప్పుడు పెన్సిల్ విరగడము, కలం కనిపించకుండా పోవడమూ సాధారణం. పరీక్షలో ఉత్తీర్ణత సాధించడమే ముఖ్యం. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను సైనికదళాలు 100 శాతం కచ్చితత్వంతో సాధించాయి. పాక్‌తోగానీ మరే ఇతర దేశంతోగానీ ఎప్పుడూ విజయవంతమైన ప్రభుత్వాల సారథ్యంలో స్నేహాన్నే భారత్ కోరుకుంటోంది. గతంలో భారత్ 'లాహోర్ బస్సు యాత్ర' బాషలో మాట్లాడితే ధూర్త పాక్‌కు బోధపడలేదు. వాళ్లకు అర్థమయ్యేలా ఈసారి మేం 'బాలాకోట్ దాడి' భాషలో మాట్లాడాం. భారత్ ఏ దేశంతోనైనా కరచాలనం కోసం స్నేహహస్తమే అందిస్తుంది. చేతిని మెలిపెట్టాలని చూస్తేమాత్రం ఆ చేతినే విరిచేస్తుంది. పౌరుల ప్రాణాలకు హాని తలపెట్టాలని చూస్తే భారత్ ఏ స్థాయిలో విరుచుకుపడుతుంతో ఆపరేషన్ సిందూర్ కళ్లకుకట్టింది. భారత్‌ను ఏనాటికీ ఓడించలేమని పాక్ పాలకులకు అర్థమైంది. అందుకే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్నారు. కానీ అది వాళ్లనే మింగేస్తోంది. అమాయక పాక్ ప్రజలనూ చంపేస్తోంది. ఆపరేషన్ ముగియలేదు. పాక్ మళ్లీ తోక జాడిస్తే మళ్లీ సిందూర్ మొదలవుతుంది" అని రాజ్‌నాథ్ అన్నారు.

### వాణిజ్య అంశాల్లో సిందూర్ ప్రస్తావన రాలేదు:

జైశంకర్‌ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడారు. "ఆపరేషన్ సిందూర్ వేళ ట్రంప్, మోదీ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదు. అమెరికాతో వాణిజ్యానికి, ఈ ఆపరేషన్‌కు సంబంధం లేదు. ది రెసిస్టెంట్ ఫ్రంట్‌ను అంతర్జాతీయ ఉగ్రసంస్థగా ప్రకటించడంలో విజయంసాధించిన భారత దౌత్యానికి కృతజ్ఞతలు చెప్పాల్సిందే. మనం పాక్ నడిబొడ్డులోని బహావల్పూర్, మురిద్కేలోని స్థావరాలను నేలమట్టంచేయగలమని ఎవరైనా ఊహించారా?. పహల్గాం దాడిని బ్రిక్స్, క్వాడ్ కూటములేకాదు ఎన్నో దేశాలు ఖండించాయి. పాక్‌పై దాడిచేశాక దాడులను ఆపాలని పాక్ నుంచే అభ్యర్థన వచ్చింది. కానీ మేం పాక్ డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్(డీజీఎంఓ) నుంచి అభ్యర్థన వస్తేనే ఆపుతామని చెప్పాం" అన్నారు.

### ప్రతిపక్షాలపై అమిత్ షా ఆగ్రహం..

విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రసంగిస్తుంటే విపక్ష సభ్యులు పదేపదే అడ్డుత గిలారు. హోం మంత్రి అమిత్ షా జోక్యంచేసుకుని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. "ఆపరేషన్ సిందూర్‌పై మంత్రి జైశంకర్ చేసిన ప్రకటనను కాంగ్రెస్ సభ్యులు అస్సలు విశ్వసించట్లేరు. బయటివాళ్లు (ట్రంప్) చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్‌కు నమ్మకం ఎక్కువ. మీ పార్టీలో విదేశీయుల అభిప్రాయాలకు ఎంతటి విలువుందో ఇప్పుడే తెలుస్తోంది. మీ అభిప్రాయాలను పార్లమెంట్‌పై రుద్దకండి. విదేశీయులను నమ్మినందుకే మీరు విపక్షంలో కూర్చున్నారు. ట్రంప్ వంటి విదేశీయుల మాటలను ఇలాగే నమ్ము తూ పోతే మీరు ఇలాగే మరో 20 సంవత్సరాలు విపక్షంలోనే ఉండిపోతారు" అని వ్యాఖ్యానించారు.

### ప్రశ్నలు కురిపించిన కాంగ్రెస్

చర్చలో కాంగ్రెస్ తరఫున లోక్‌సభలో ఉపనేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రశ్నలు సంధించారు. " పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకునే ఉద్దేశం మోదీ సర్కార్‌కు లేనట్లుంది. నిజంగా తిరిగి హస్తగతం చేసుకునే ఆలోచనే ఉంటే హఠాత్తుగా ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు ఆపాల్సి వచ్చింది?. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు పీఓకేను స్వాధీనంచేసుకుంటాం?. పాక్, భారత్ పరస్పర సైనిక చర్యలకు ముగింపు పలికింది తానేనని ట్రంప్ 26 సార్లు ప్రకటించుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?. భారత్, పాక్ యుద్ధం ఆపితేనే వాణిజ్యం కొనసాగి స్తానని ట్రంప్ అమెరికా వాణిజ్య కత్తిని చూపి బెదిరించారా?. ఇంట్లో చొరబడి మరీ చంపుతామని ఇప్పటికి ఎన్నోసార్లు మోదీ అదే డైలాగ్‌లు కొడుతున్నారు. మరి సిందూర్ పరిసమాప్తంకాలేదని, పాక్ దాడిచేస్తే మళ్లీ మొదలవుతుందని వాళ్లే చెబుతున్నారు. అలాంటప్పుడు సిందూర్ విజయవంతమైందని ఎలా అంటారు? యుద్ధం చేయడం తమ విధానం కాదంటారు? మరి సిందూర్‌వేళ చేసిందేంటి? వాళ్ల అధీనంలోని భూభాగాన్ని స్వాధీనంచేసుకోవడానికి సిందూర్ చేయలేదంటున్నారు. మరి దేని కోసం చేసినట్లు? సిందూర్ వేళ ఎన్ని యుద్ధవిమానాలను కోల్పోయాం?" అని గొగోయ్ ప్రశ్నించారు.

### డిప్యూటీ ఛైర్మన్‌కు 26 నోటీసులు

బిహార్ ఓటర్ల జాబితా అంశంతోపాటు ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ వలసకూలీలు వివక్షను ఎదుర్కొనే పలు అంశాలపై రాజ్యసభలో చర్చించాలంటూ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌కు మొత్తం 26 వాయిదా తీర్మానాలు వచ్చాయి. వీటన్నింటినీ ఆయన తోసిపుచ్చారు. జీరోఅవర్ సెషన్‌ను మొదలుపెట్టాలని నామినేటెడ్ సభ్యురాలు సుధామూర్తిని హరివంశ్ కోరగానే విపక్షసభ్యులు ఆందోళన పెంచారు. ఓటు చోరీని ఆపాలి అని నినాదాలుచేశారు. దీంతో మధ్యాహ్నం సెషన్‌లోపే సభ రెండుసార్లు వాయిదాపడింది. తర్వాత సభ మొదలైనా మళ్లీ ఇదే పునరావృతమైంది. దీంతో సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా విపక్షసభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలిస్తూ సభ జరక్కుండా అడ్డుకున్నారు. దీంతో చేసేదిలేక సభను మంగళవారానికి వాయిదావేశారు.,

## అమ్మతనానికో రేటు



అమ్మతనానికో రేటు పెట్టేశారు.. ఇష్టానుసారం అమ్మేస్తున్నారు ఐవీఎఫ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా ఒక్కో జంట నుంచి రూ.10 లక్షల నుంచి 15 లక్షల వరకూ లాగేస్తున్నా పిల్లలు కావాలనే ఆశతో వస్తున్న దంపతుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. అయినా అడిగే నాథుడు లేడు ఎవరు ఎంతచెబితే అంత ఆదివారం సికింద్రాబాద్‌లోని ఒక సంతాన సాఫల్యత కేంద్రంలో జరిగిన ఘరానా మోసం దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతోంది. ఒక చిన్నారికి క్యాన్సర్ రావడంతో తల్లిదండ్రులకు కలిగిన అనుమానం 'సృష్టి' సంతాన సాఫల్య కేంద్రం నిర్వాకం పేరుతో జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తెచ్చింది. పుట్టిన బిడ్డ తమ వీర్యకణాలతోనే కలిగిందా లేదా అనే అనుమానంతో డీఎన్ఏ పరీక్ష చేయించగా.. అసలు నిజం వెలుగులోకి వచ్చింది. అతి సహజంగా, సాఫీగా సాగే ప్రక్రియ గర్భధారణ. అదేంటో కొందరికిదే అత్యంత సంక్లిష్టంగా మారుతుంది. ఏండ్లకేండ్లు సంతానం కోసం నిరీక్షిస్తున్నా కలగానే మిగిలిపోతుంటుంది. పెండ్లై ఏండ్లు గడుస్తున్నా పిల్లలు లేకపోవడంతో కుటుంబాల ఒత్తిడి, పిల్లలు కలగాలనే ఆశతో చాలామంది దంపతులు ఫెర్టిలిటీ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితు ల్లోనే కృత్రిమ గర్భధారణ పద్ధతులు ఎంత గానో ఆదుకుంటున్నాయి. ఎందరికో సంతాన భాగ్యాన్ని ప్రసాదిస్తున్నాయి. అయితే సంతానలేమితో మానసికంగా, భావోద్వేగ పరంగా బలహీనంగా ఉండే దంపతులు పిల్లలకోసం ఎంతైనా ఖర్చు పెట్టడానికి సిద్ధపడుతుంటారు. ఇదే అదనుగా భావించిన కొన్ని ఫెర్టిలిటీ కేంద్రాలు మోసాలకు తెగబడుతూ మగ బిడ్డకైతే ఒక రేటు ఆడ బిడ్డకైతే మరో రేటు కవల పిల్లలకైతే ఇంకో రేటు.. ఇలా అమ్మతనమివ్వడానికి రేటు కట్టేశాయి వైద్యం పేరుతో ఇష్టానుసారం దోచేస్తూ వారి బలహీనతను క్యాష్ చేసుకుంటున్నాయి. "సంతానం లేని దంపతులకు పిల్లలు కలిగించే పూచీ మాది" అని చెప్పుకొనే సాఫల్య కేంద్రాల నయవంచన ఇది. ప్రపంచ జనాభాలో అత్యధిక జనాభా కలిగిన మనదేశంలో ఏ వీధికెళ్లినా ఓ ఫెర్టిలిటీ సెంటర్ దర్శనమిస్తున్నది. ఐవీఎఫ్ నుంచి సరొగసీ వరకూ అన్ని సేవలూ అందించే ఈ క్లినిక్‌లు సాధారణ నర్సింగ్‌హోమ్‌ల కన్నా రద్దీగా ఉంటున్నాయి. ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెడ్ రిప్రొడక్షన్ అంచనా ప్రకారం దేశంలో దాదాపు మూడు కోట్లమంది సంతానరాహిత్యంతో బాధపడుతు న్నారట. సంతానలేమి సమస్య అనగానే మొదట స్త్రీలవైపే వేలెత్తి చూపే సమాజం ఇప్పుడిప్పుడే స్త్రీ పురుషులిద్దరి ఆరోగ్య సమస్యగా చూడడం పెరుగుతోంది. ప్రాథమికంగా ఇది శారీరక స్థితికి సంబంధించినదే అయినప్పటికీ జీవనశైలీ, వాతావరణ ప్రభావం దానిని ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నది కాదనలేని వాస్తవమని ప్రపంచ ఆరోగ్యసంస్థ సైతం స్పష్టంచేస్తోంది. సంతానరాహిత్యానికి జన్యుపరమైన సమస్యలూ కొంత కారణమైనప్పటికీ, కుటుంబ, సామాజిక వాతావరణం, ఒత్తిళ్లూ, ఆహారపుటలవాట్లూ ఆ సమస్యని పెంచుతున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ సమస్యలోనూ స్త్రీపురుషులిద్దరి భాగస్వామ్యమూ సమానమన్నది పచ్చి వాస్తవం. సికింద్రాబాద్ స్పెర్మ్ టెక్ సంస్థపై జరిగిన పోలీసుల దాడుల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూస్తున్నాయి. మంచి శరీరపుష్టి ఉండి.. క్రీడాకారుల్లా కనిపించే యువకులను వీర్యదానానికి.. మేలిమిరంగు శరీరచ్ఛాయతో.. చక్కటి ఆకర్షణీయంగా ఉండే యువతులను అండ దానానికి ఎంచుకుంటూ బతుకు తెరువుకు భాగ్యనగరం వచ్చి ఉద్యోగాలు దొరక్క ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న యువతకు డబ్బుల ఆశ చూపి వారికి గాలం వేస్తున్నారు నిర్వాహకులు. అంతేకాకుండా అధిక ఎక్కువ అండాలు, వీర్యకణాలు ఉత్పత్తి అయ్యేలా హార్మోన్ ఇంజెక్షన్లు చేస్తూ మరో దారుణానికి ఒడికడుతున్నారు. ఈ ఇంజెక్షన్లను అతిగా తీసుకోవడం వల్ల భవిష్యత్‌లో వంధ్యత్వం దారితీసే ప్రమాదాలు లేకపోలేదని గైనకాలజిస్టుల ఆందోళన పరిస్థితి తీవ్రతను తెలుపుతుంది. ఈ దందా పూర్తిగా అక్రమమే అయినా 'మూడు స్పెర్మ్‌లు ఆరు అండాలు'గా పెరిగిపోతున్నదని పోలీసులే చెబుతున్నారు. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ చట్టం 2021, సరోగసీ చట్టం 2021లను ఈ సంస్థ ఉల్లంఘించినట్లు పోలీసులు గుర్తించారు. మనదేశంలో సరోగసీ, స్పెర్మ్ కలెక్షన్లకు సంబం ధించి నిర్దిష్ట చట్టాలున్నాయి. మరి వాటి అమలు ఏందుకు కుంటుబడింది. ఇవి ప్రశ్నలుగానే మిగిలిపో తున్నాయి. విద్యా వైద్యం ప్రయివేటుపరమైన తర్వాత వ్యాపార ధోరణి పెరిగిపోవడం వలన ఇలాంటి అనార్థాలు చోటుచేసుకుంటు న్నాయి. వీటిని అరికట్టాల్సిన ప్రభుత్వాలు చర్యలకు మీనమేషాలు లెక్కిం చడం ఉదాసీనత ప్రదర్శించడంతో ఇలాంటి దందాలు కొనసాగుతు న్నాయి. వీటి తక్షణమే నివారించే దిశగా ప్రభుత్వ చర్యలుండాలి.

## పుట్టిన 6 రోజులకే తల్లిని కోల్పోయిన ఈ పాపకి ఎవరు సమాధానం చెప్పాలి..




ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్)జులై -29: ప్రభుత్వ డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే ఆ తల్లి ప్రాణం కోల్పోయిందన్న కుటుంబ సభ్యులు.పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ప్రసవించి ఆడ బిడ్డ కు జన్మనిచ్చిన మహిళా 5 రోజులు గడిచిన తర్వాత మంగళవారం ఉదయం మరణించిన ఘటన.పెద్దపల్లి ప్రభుత్వ హాస్పటల్లో చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం దురద కారణంగా మహిళకు ఇంజక్షన్ చేయడం ద్వారా అది వికటించి కొద్దీ సమయానికి బాడీ మొత్తం వాపులతో శరీరం అంత నిండిపోయి స్పృహను కోల్పోవడం జరిగింది.దాని గురించి డాక్టర్ వాళ్ళని వివరణ అడగగా పురుగు కుట్టుంది లేక మటన్ తినడం వాళ్ళ ఇన్ఫెక్షన్ అయింది అని డొంక తిరుగుడు సమాధానం చెప్పారు. అక్కడే చనిపోయిన మహిళను సీరియస్ గా ఉంది అని చెప్పి కరీంనగర్ కు ఎందుకు పంపారుని .కుటుంబ సభ్యులు వాపోయారు.దీనిపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ స్పందించి మాకు జరిగిన నష్టం ఎవరికీ జరగకుండా చూడాలి అని కలెక్టర్ కి విన్నాపించు కుంటున్నా కుటుంబ సభ్యులు.

## మంథని మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) జూలై-29: బయోమెట్రిక్ విధానం ద్వారా వైద్య సిబ్బంది హాజరు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, మంథని మండలంలో విస్తృతంగా పర్యటించారు. మంథని పట్టణ కేంద్రంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మాత శిశు ఆసుపత్రి, గోపాల్ పూర్ గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గద్దెలపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో వార్డులను క్షుణ్ణంగా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగుల కొరకు నూతనంగా నిర్మించిన షెడ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఆసుపత్రిలో సిబ్బంది, వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని, ప్రతిరోజు తప్పనిసరిగా హాజరు వివరాలను బయోమెట్రిక్ విధానం ద్వారా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలను గర్భిణీ మహిళలకు అందించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గోపాల్ పూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అన్నారు. గద్దెలపల్లి ప్రాథమిక ఆసుపత్రిని పరిశీలించి ఏ.ఎం.సి ప్రొఫైల్ సక్రమంగా నిర్వహించాలని, ఎన్ .సి .డి స్క్రీనింగ్, ఎక్స్ రే .టి.బి. ముక్త్ భారత్ మరియు ఆరోగ్య మహిళ తదితర వాటిపై ఆరా తీశారు. ఓ.పీ సేవలు పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎం.పీ.డీ.వో. శశికళ, మంథని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, ఏ.ఈ.పి.ఆర్. అనుదీప్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఆర్టిఐ సెక్రెటరీ జె రాములు



పాపన్నపేట జులై 29 శుభోదయం న్యూస్(మల్లొడ్డి కృష్ణ): శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారిని దర్శించుకున్న ఆర్ టి ఐ సెక్రెటరీ జే.రాములు, మరియు డిప్యూటీ సెక్రెటరీ శ్రీమతి ప్రమీల, మరియు కమిటీ మెంబర్స్ వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ప్రతాప్ రెడ్డి సూర్య శ్రీనివాస్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## పభుత్వ అనుమతి కోరి దీక్షకు దిగుతా

తెలంగాణ : బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో తాను 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయబోతున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి కోరి దీక్షకు దిగుతానని ఒక వేళ అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ కూర్చుంటే అక్కడే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహ సాధన కోసం తాను 72 గంటలు దీక్ష చేస్తే నాటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కవిత మీడియాతో మాట్లాడుతూ . 2018 పంచాయతీ రాజ్ సవరణ చట్టాన్ని సవరణ చేస్తూ తెలంగాణ జాగృతి చేసిన డిమాండ్ తోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసిందని చెప్పారు. తమిళనాడులో గవర్నర్ జాప్యం చేస్తే కోర్టుకు వెళ్లి తీర్పు తెచ్చుకున్నారని మరి తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ వద్ద పెండింగ్ అంశంపై కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తే సానుకూల తీర్పు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కోర్టులో కేసు వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీకి ఉన్న ఒప్పందం కారణంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం లేదని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేయాలన్నారు. తాము ఢిల్లీలో చేసే ధర్నాకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటున్నారు ఇదేమైనా సత్రం భోజనమా ? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అఫీషియల్ గా అఖిలపక్షంను ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షం ఢిల్లీకి రావాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, అన్ని రాజకీయ పార్టీలకు ప్రభుత్వం లేఖలు రాయలన్నారు. పొన్నం ప్రభాకర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం డ్రామా చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా శూన్యం అని రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తప్పించుకుంటోందని విమర్శించారు. బీజేపీ బీసీ సీఎం, బీసీ పీఎం అంటున్న బీజేపీకీ బీసీలపై చిత్తశుద్ధి లేదని కవిత ధ్వజమెత్తారు.

## ఉచిత బస్సు ప్రయాణంపై

### రోడ్డు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ కీలక వ్యాఖ్యలు..



**అమరావతి,:** ఉచిత బస్సు ప్రయాణంపై రోడ్డు రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.. తాజాగా తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. త్వరలో ఉచిత బస్సు పథకానికి మంచి పేర్లు పెడతామన్నారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు అవుతోంది.. ఆయా రాష్ట్రాల్లో అమలువుతున్న విధంగానే ఏపీలోనూ పథకాన్ని అమలు చేస్తామన్నారు. సూపర్ సిక్స్ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అతి ముఖ్యమైన పథకమన్నారు. అన్ని పథకాల కంటే ఎక్కువ లబ్ధిదారులు ఉండే పథకం ఇదే అన్నారు.. ఇందుకు తాజాగా కొత్త బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు. చాలా వాటికి మరమ్మతులు చేపట్టామని వెల్లడించారు. ఏపీ ఉచిత బస్సు ప్రయాణం సూపర్ సక్సెస్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. తాను మంత్రి అయ్యాక 1200 బస్సులు కొన్నట్లు చెప్పారు. ఇక.. వచ్చే 15 నుంచి ఏపీలో మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు కానుంది. పథకం అమలుకు సంబంధించి ఇప్పటికే సీఎం చంద్రబాబు అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. నాలుగు రోజుల క్రితం ఆర్టీసీ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష చేశారు. ఫ్రీ బస్సు పథకంతో ప్రజలకు ఎలా లబ్ధి కలుగుతుందో తెలిపేలా జీరో ఫేర్ టిక్కెట్ విధానాన్ని తీసుకురావాలని సూచించారు. మహిళా ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లారు?.. టిక్కెట్ ధర ఎంత?.. ప్రభుత్వం ఎంత మేర రాయితీ ఇస్తోంది?.. అనే సమాచారం స్పష్టంగా ఉండాలన్నారు. అవసరమైన సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు సీఎం చంద్రబాబు.

# భూమి మీద నుంచే శాటిలైట్లపై దాడి!

అత్యాధునిక ఆయుధ తయారీలో నిమగ్నమైన చైనా

శక్తివంతమైన క్రిస్టల్‌ను తయారుచేసిన డ్రాగన్ దేశం

పరారుణ కాంతి పుంజాన్ని వెలువర్చనున్న అసాధారణ కృత్రిమ స్ఫటికం

ప్రపంచంలోనే అతిపెద్ద బీజీసీఈ స్ఫటికమిది



ఎల్రక్టానిక్స్, టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్స్‌సహా ఎన్నో రంగాల్లో ప్రపంచ అగ్రగామిగా వెలుగొందుతున్న చైనా ఇప్పుడు మరో అసాధారణ, శక్తివంతమైన ఆయుధ తయారీలో తలమునకలైంది. అగ్రరాజ్యం అమెరికాను తలదన్నేలా ఎన్నెన్నో ఆవిష్కరణలు చేసిన చైనా ఇప్పుడు దేశ భద్రత, రక్షణే పరమావధిగా కీలక ఆయుధాన్ని సృష్టిస్తోంది. తమ వైమానిక, అణు స్థావరాలు, వ్యూహాత్మకప్రాంతాల గుట్టుమట్టు చెప్పే విదేశీ, శత్రు ఉపగ్రహాలను అంతరిక్షంలోనే తునాతునకలు చేసే లేజర్ కాంతి ఆయుధాన్ని అభివృద్ధిచేస్తోంది. కాంతి సాధారణ స్థాయిలోకాకుండా ప్రత్యేకమైన స్ఫటికాల గుండా ప్రసరించినప్పుడు మరింత శక్తివంతంగా మారుతుంది. అత్యంత తీక్షణతో ప్రసరిస్తూ ఆ లేజర్ కాంతి ఎంతటి కఠినమైన పదార్థాన్నైనా సునాయాసంగా కోసేస్తుంది. భవిష్యత్తులో పనికిరాకుండా సర్వనాశనంచేసేస్తుంది. లేజర్ కాంతి ఎంతటి శక్తివంతమైందో ఇప్పటికే పరిశ్రమ రంగంలో చూస్తూనే ఉన్నాం. ఇప్పుడీ లేజర్ కాంతిని అంతరిక్షంలో చక్కర్లు కొట్టే శత్రుదేశాల ఉపగ్రహాలపైకి చైనా ప్రయోగించనుంది. భూమి నుంచి ఎన్నో కిలోమీటర్ల ఎత్తులో పరిభ్రమించే ఉపగ్రహాలను నేలమీద నుంచే గురిచేసి కొట్టడం అంత తేలికైనపని కాదు. అందుకే బేరియం గాలియం సెలినైడ్(బీజీసీఈ) కృత్రిమ స్ఫటికాన్ని చైనా అభివృద్ధి చేసింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద క్రిస్టల్ అని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తన కథనంలో పేర్కొంది. ఎంత పెద్ద ఇనుపగుండుతో దెబ్బ కొడితే అంతగా బీభత్సం స్థాయికి పెరుగుతుంది. అలాగే బీజీసీఈ క్రిస్టల్ నుంచి వెలువడే లేజర్ కాంతి సృష్టించే వినాశనం కూడా అంతే భారీ స్థాయిలో ఉంటుంది.

### సూక్ష్మం నుంచే సర్వనాశనం..

బీజీఈసీతో తయారైన లేజర్ కాంతి పుంజం వ్యాసం కేవలం 6 సెంటీమీటర్లు మాత్రమే. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది ఒక ఖడ్గం అంచుకు ఉండే పదునులాంటిది. కత్తి అంచును ఎంత సానబడితే అంత పదునెక్కుతుంది. అలాగే ఈ స్ఫటికం ఎంత పారదర్శకంగా ఉంటే అందులోంచి వెలువడే లేజర్ కాంతి అంత ప్రాణాంతకంగా మారుతుంది. ఇది ఆకాశంలో చాలా కిలోమీటర్ల దూరం వరకు తీవ్రత ఏమాత్రం తగ్గకుండా అదే తీక్షణతతో దూసుకెళ్తుంది. అలా అది ఏకంగా ఉపగ్రహాలను సైతం ముక్కలుగా కోసేస్తుంది. స్వల్పశ్రేణి పరారుణకాంతి పుంజాలను అత్యంత సుదూరమైన లేజర్ కాంతి పుంజాలుగా, మారణాయుధాలుగా మార్చేందుకు బీజీఈసీ స్ఫటికం అక్కరకొస్తుంది. “చదరపు సెంటీమీటర్ల విస్తీర్ణంలో ఏకంగా 550 మెగావాట్ల లేజర్ కాంతిని ఈ స్ఫటికం ప్రసరింపజేస్తుంది. ఇంతటి తీక్షణత ధాటికి ఎంతటి కఠినమైన మూలకంతో తయారైన ఉపగ్రహ ఉపరితల పొరనైనా ముక్కలవడం ఖాయం. వందల కిలోమీటర్ల ఎత్తు నుంచి తమపై నిఘా పెట్టిన శత్రు ఉపగ్రహాలను ఉన్నచోటులోనే ఉన్నపళంగా నిర్వీర్యంచేసే శక్తి ఈ క్రిస్టల్ పరారుణ కాంతి ఆయుధానికి ఉంది”అని ప్రొఫెసర్ వూ హైక్సిన్ అన్నారు. ఈయన సింథటిక్ క్రిస్టల్ జర్నల్‌లో ప్రచురించబడిన పరిశోధనాపత్రానికి ముఖ్యరచయితగా వ్యవహరించారు.

### అత్యంత సురక్షితం, అతి సామర్థ్యం..

ఇంతటి తీక్షణమైన కాంతి పుంజాన్ని వెదజల్లేటప్పుడు ఈ ఆయుధవ్యవస్థ బాగా వేడెక్కుతుంది. అలాంటప్పుడు వేడికి అదే కాలిపోతుంది. అలాంటి పరిస్థితులురాకుండా దీనిని తయారుచేస్తున్నారు. గతంలో అమెరికా అచ్చం ఇలాంటి ప్రయోగమే చేసి చేతులుకాల్చుకుంది. 1997లో అమెరికా నావికాదళం మిడ్ ఇన్‌ఫ్రారెడ్ అడ్వాన్స్‌డ్ కెమికల్ లేజర్(మిరాకిల్) పేరిట ఒక ప్రయోగంచేసింది. సొంత ఉపగ్రహాన్నే పలుమార్లు పరారుణకాంతితో కరిగించేందుకు ప్రయత్నించి విజయవంతమైంది. కానీ ఆ లేజర్‌బీమ్‌ను వెదజల్లే వ్యవస్థ సైతం కరిగిపోయింది. ఈ పరిస్థితి తలెత్తకుండా చైనా పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. బేరియం గాలియం సెలినైడ్(బీజీసీఈ) కృత్రిమ స్ఫటికాన్ని చైనా శాస్త్రవేత్తలే తొలిసారిగా 2010లో అభివృద్ధిచేశారు. వెంటనే దీనిని తమ ఆయుధవ్యవస్థల్లో అమర్చుకునేందుకు పలు దేశాల రక్షణశాఖలు ప్రయత్నించినా అది ఎందుకో సఫలంకాలేదు.

# భూమి.. వేగంగా తిరుగుతోంది!

వాతావరణ మార్పులు, మంచు కరగడమే కారణం

భూభ్రమణ వేగం వల్ల ‘24 గంటల్లో’ స్వల్ప తగ్గుదల

కంప్యూటర్లు, శాటిలైట్ల వంటి వ్యవస్థలపై ప్రభావం

ఈ మధ్య భూమి వేగంగా తిరుగుతోందని శాస్త్రవేత్తలు అంటున్నారు. భూభ్రమణం వల్లనే పగలు, రాత్రి ఏర్పడతాయి. అంటే వేగం ప్రభావం కాలం మీదా పడుతుంది. టైమ్ ఆధారంగా పనిచేసే కంప్యూటర్లు, జీపీఎస్ శాటిలైట్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, స్టాక్ మార్కెట్ల వంటి ఆర్థిక వ్యవస్థలు.. అన్నీ ప్రభావితమవుతాయి. అంటే.. సుదీర్ఘకాలంలో మానవాళికి ఓ అకాల సమస్య సవాలు విసరనుందా? ఈ ఏడాది వేసవిలో భూమి చాలా వేగంగా తిరిగింది. ఫలితంగా రోజు వేగంగా గడిచిపోతోంది. జూలై 10.. ఈ ఏడాదిలో అత్యంత పొట్టి రోజు. రోజుకు ఉండాల్సినవి 24 గంటలు. కానీ ఇంటర్నేషనల్ ఎర్త్ రొటేషన్ అండ్ రిఫరెన్స్ సిస్టమ్స్ సర్వీస్, యూఎస్ నేవల్ అబ్జర్వేటరీల వంటి వాటి ప్రకారం ఆ రోజున 1.36 మిల్లీ సెకన్లు (0.00136 సెకన్లు) తక్కువయ్యాయి. జూలై 22, ఆగస్టు 5న కూడా ఇలాంటి పొట్టి రోజులే నమోదు కానున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వరుసగా 1.34, 1.25 మిల్లీ సెకన్లు ఈ రెండు రోజుల్లో లోటు పడతాయట.

### 86,400 సెకన్లకు అటూ ఇటుగా..

భూమి తనచుట్టూ తాను తిరగడానికి 24 గంటలు లేదా 86,400 సెకన్ల సమయం పడుతుందని మనం చదువుకున్నాం. కానీ, చంద్రుడి గురుత్వాకర్షణ, భూ కేంద్రంలో మార్పుల ప్రభావం.. వీటన్నింటివల్ల కచ్చితంగా 86,400 సెకన్లు ఉండదు. కాస్త అటూ ఇటుగా ఉంటుంది. స్వల్పకాలంలో దీని ప్రభావం మనపై పెద్దగా కనిపించదు కాబట్టి మనకు తెలియదు.

### అణు గడియారాలు

సమయాన్ని అత్యంత కచ్చితంగా కొలిచేందుకు రూపొందించినవే అణుగడియారాలు. ప్రతి అణువుకు ఒక నిర్దిష్ట పౌనఃపున్యం (ఫ్రీక్వెన్సీ) ఉంటుంది. ఈ పౌనఃపున్యం ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటుంది. అణు గడియారాలు ఈ పౌనఃపున్యాన్ని ఉపయోగించి సమయాన్ని కొలుస్తాయి. ఈ సమయాన్నే కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్ (యూటీసీ) అని పిలుస్తారు. ఇది దాదాపు 450 అణు గడియారాలపై ఆధారపడి ఉంటుంది. ఇది సమయపాలనకు ప్రపంచ ప్రమాణం, అలాగే మన ఫోన్ లు, కంప్యూటర్‌లు అన్నింటిలోనూ పొందుపరిచిన సమయం కూడా ఇదే.

### 1972 నుంచి..

1972 నుంచి భూమి భ్రమణ వేగం బాగా తగ్గింది. అణు గడియారాలతో పోలిస్తే.. ఈ సమయం తక్కువ కావడంతో యూటీసీకి ‘లీప్ సెకన్’ను జోడించాలని ఇంటర్నేషనల్ ఎర్త్ రొటేషన్ అండ్ రిఫరెన్స్ సిస్టమ్స్ సర్వీస్ ఆదేశించింది. దీన్ని పాజిటివ్ లీప్ సెకన్ అని పిలుస్తారు. చెప్పాలంటే ఇది లీప్ ఇయర్ లాంటిది. 1972 జూన్ 30 నుంచి మొత్తం ఇలా 27 లీప్ సెకన్లను యూటీసీకి అదనంగా జోడించారు. కానీ, 2016 డిసెంబర్ 31 తరవాత మాత్రం ఒక్కటి కూడా అదనంగా చేరలేదు.



### ఎందుకు ఈ వేగం?

డంకన్ ఆగ్నూ అగ్నూ అంచనాల ప్రకారం.. చంద్రుడు, సముద్ర అలల కారణంగా భూభ్రమణంలో అత్యంత స్వల్ప కాల మార్పులు సంభవిస్తున్నాయి. చంద్రుడు భూమధ్యరేఖకు పైన ఉంటే భూమి నెమ్మదిగా తిరుగుతోంది. వేసవిలో భూమి కాస్త వేగంగా తిరుగుతుంది. వాతావరణ మార్పులు కూడా లీప్ సెకన్‌కు కారణమవుతున్నాయి. గత ఏడాది ‘నేచర్’జర్నల్‌లో ప్రచురితమైన ఆగ్నూ అధ్యయనం ప్రకారం.. అంటార్కిటికా, గ్రీన్‌ల్యాండ్‌లలోని మంచు కరిగి సముద్రాల్లోకి కలిసి, సముద్ర మట్టాలు పెరిగి భూభ్రమణ వేగం తగ్గుతోంది. మంచు కరగడం భూమి అక్షంలో కూడా మార్పులకు కారణమవుతోందని స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ ప్రొఫెసర్ బెనెడిక్ట్ సోజా పరిశోధనలో తేలింది. ‘సాధారణంగా చంద్రుడు భూభ్రమణాన్ని ఇంతవరకు ప్రభావితం చేస్తున్నాడు. కానీ, ఈ శతాబ్దం చివరి నాటికి.. భూమిపై గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు భారీగా పెరిగి అవి భూభ్రమణ వేగాన్ని ప్రభావితం చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు’ అంటున్నారు సోజా.

### లీప్ సెకన్

కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్ – యూటీసీ నుంచి ఒక సెకను తీసేస్తే నెగటివ్ లీప్ సెకండ్ అంటారు. పాజిటివ్ లీప్ సెకన్ అంటే యూటీసీకి ఒక సెకన్‌ను జోడిస్తారు. భూభ్రమణ వేగం పెరిగినప్పుడు నెగటివ్ లీప్ సెకన్ అవసరమవుతుంది. దీనివల్ల ఒక రోజు 86,400 సెకన్ల కంటే కొంచెం తక్కువగా ఉంటుంది. సాధారణంగా సమయాన్ని గంటలు, నిమిషాలు, సెకన్లలో చెప్తాం. ఉదాహరణకు.. 23:59:59 తరవాత.. 00:00:00 వస్తుంది. కానీ పాజిటివ్ లీప్ సెకన్ ఉంటే.. 23:59:59, 23:59:60 తరవాత 00:00:00 వస్తుంది. అదే నెగటివ్ లీప్ సెకన్ అయితే... 23:59:57, 23:59:58 తరవాత 00:00:00 వస్తుంది. 1949లో మొట్టమొదటి అణు గడియారం తయారైనప్పటి నుంచి చూస్తే 2024 జూలై 5ను శాస్త్రవేత్తలు అతి పొట్టి రోజుగా గుర్తించారు. ఈ రోజున 24 గంటల కంటే 1.66 మిల్లీసెకన్లు తక్కువ నమోదయ్యాయి.

### లీప్ సెకన్ ప్రభావం?

టెలికమ్యూనికేషన్ వ్యవస్థలు, కంప్యూటర్లు, ఆర్థిక లావాదేవీలు, ఎలక్ట్రిక్ గ్రిడ్‌లు, జీపీఎస్ శాటిలైట్లు వంటి అనేక వ్యవస్థలు సమయంపై ఆధారపడి పనిచేస్తాయి. ఇంతవరకు ఇవి పాజిటివ్ లీప్ సెకన్‌నే చూశాయి. నెగటివ్ లీప్ సెకన్ వల్ల ఇవి ఎలా ప్రభావితమవుతాయో చెప్పడం కష్టం అంటున్నారు శాస్త్రవేత్తలు.

ఉంచాలా.. తీసేయాలా?

‘లీప్ సెకన్ అనేది మనం సృష్టించింది. ఈ లీప్ సెకన్ పద్ధతినే తీసేస్తే గొడవ ఉండదు కదా’ అని వాదించేవారు లేకపోలేదు. ‘గడియారంలోంచి మనం తీసేయగలం. కానీ, భూభ్రమణంలో వచ్చే మార్పులను చెరిపేయలేం. సుదీర్ఘకాలంలో మానవాళిపై వాటి ప్రభావాన్ని తుడిచేయలేం. భూమి నెమ్మదిగానో వేగంగానో తిరుగుతోందని.. అందుకు భూతాపం వంటివి కారణమవుతున్నాయని తెలుసుకునేందుకు.. ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. కాబట్టి ఇది ఉండాల్సిందే’ అని గట్టిగా వాదిస్తున్నవారూ ఉన్నారు.

# పోషకాల ‘పుట్ట’ గొడుగులు

సమతుల్య ఆహారమే కాక ఆరోగ్యం కూడా..

గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో సంప్రదాయ ఆహారంగా వాడుక



కరకగూడెం: వర్షాకాలం ప్రారంభం కాగానే అటవీ ప్రాంతంలో పుట్టగొడుగులు పెరుగుతుంటాయి. గ్రామాల్లో మొలిచే పుట్టగొడుగులతో పోలిస్తే అటవీ ప్రాంతంలో పెరిగేవి గిరిజన, ఆదివాసీల ఆహారంలో ఏళ్లుగా భాగమవుతున్నాయి. అంతేకాక వీటి అమ్మకం ద్వారా గిరిజనులు ఆర్థిక వనరుగా ఉపయోగించుకుంటున్నారు. గిరిజన, ఆదివాసీలు పుట్టగొడుగులను సేకరించి చిన్న కట్ట రూ.50కి, కేజీ రూ.500-రూ.700 వరకు ప్రాంతాల ఆధారంగా విక్రయిస్తుంటారు. ఏటా ఈ సీజన్‌లో మాత్రమే దొరికేవి కావడంతో ఆదరణ కూడా బాగుంటోంది.

### పుట్టగొడుగుల రకాలు.. గుర్తింపు

గిరిజన ప్రాంతాల్లో తెల్ల, నల్ల పుట్టగొడుగులు కనిపిస్తాయి. అయితే, ఇందులో తినదగినవే కాక విషపూరితమైనవి కూడా ఉంటాయి. వీటి మధ్య తేడాను గుర్తించే పరిజ్ఞానం గిరిజనులకు అనాదిగా వస్తుండటంతో సులువుగానే సేకరిస్తుంటారు. పుట్టగొడుగుల రంగు, ఆకారం, వానే కాక అవి పెరిగిన ప్రదేశం ఆధారంగా తినదగినవా, విషపూరితమైనవా అన్నది గుర్తిస్తారు. తేమతో కూడిన వాతావరణంలో చెట్ల మొదళ్ల వద్ద, కుళ్లిన కలపపై లేదా మట్టిలో మొలి చే పుట్టగొడుగులను జాగ్రత్తగా సేకరిస్తారు. వీటితో కూ ర, పులుసులు, వేపుళ్లు, కొన్ని ప్రాంతాల్లో పచ్చళ్లు చేసుకుంటుండగా.. ఎక్కువగా సేకరిస్తే సమీప సంతలు, పట్టణాల్లో అమ్ముతుంటారు.

### పోషకాల పవర్‌హౌస్

పుట్టగొడుగులు రుచికరమైనవే కాకుండా, ప్రొటీన్లు, విటమిన్లు (ముఖ్యంగా విటమిన్ బీ, డీ,), సెలీనియం, కాపర్, పొటాషియం వంటి ఖనిజాలే కాక ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. పుట్టగొడుగులలో ఉండే కొన్ని సమ్మేళనాలు రోగనిరోధక శక్తిని పెంచడంలో సాయపడతాయి. తద్వారా వర్షాకాలంలో వచ్చే జ్వరాలు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుందని నమ్ముతారు. అలాగే కొన్ని రకాల పుట్టగొడుగులను సంప్రదాయ వైద్యంలో ఔషధాలుగానూ వినియోగిస్తారు.

### ఏటా ఎదురుచూస్తాం..

వర్షాకాలం వస్తుందంటే పుట్టగొడుగుల కోసం ఎదురుచూస్తాం. అడవిలోకి వెళ్లి సేకరించడం అలవాటు. వీటితో వండిన కూర రుచిగా ఉంటుంది. అందుకే చిన్నాపెద్దలు ఇష్టంగా తింటారు. ఎక్కువగా దొరికినప్పుడు అమ్ముకోవడం ద్వారా కాస్త డబ్బులు కూడా వస్తాయి.

### చిన్నప్పటి నుంచి తింటూనే ఉన్నాం..

చిన్నప్పటి నుంచి పుట్టగొడుగులు తింటున్నాం. ఏది తినాలి, ఏది విషపూరితమైనదో పెద్దల ద్వారా తెలుసుకున్నాం. వర్షాకాలంలో తినడానికే కాక అమ్ముతూ ఎంతో కొంత సంపాదిస్తాం. అడవిలో సహజంగా దొరికేది కావడంతో మాకు బలాన్ని ఇస్తుందని తప్పక తింటాం.

### ఆరోగ్యానికి ఎంతో మేలు

పుట్టగొడుగుల్లో ప్రొటీన్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. రోగనిరోధక శక్తి పెంచడం, వర్షాకాలంలో ఇన్ఫెక్షన్ల కట్టడికి ఉపయోగపడతాయి. ఇందులో ఏవి తినదగ్గవో సరిగ్గా గుర్తించకపోతే ప్రాణాంతకం అవుతాయి. అందుకే ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి.